Follow: @ANNTELUGU

10-10-2025


# మహా పత్రిక

ANN తెలుగు

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 305 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM


## టాప్ న్యూస్



### ఫోర్బ్స్ 2025 భారత కుబేరుల జాబితా

- ముకేష్ అంబానీ నెంబర్ వన్

07



### ఎన్నటికైనా కేసీఆర్‌కు హరీశ్ రావే వెన్నుపోటు

- నన్ను కేసీఆర్ పిలిచినా మళ్లీ వెనక్కి వెళ్లేది లేదు
- ఎమ్మెల్సీ కవిత హాట్ కామెంట్స్

02

### ఏపీలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- ఒకేసారి 31 మందికి స్థానచలనం
- సమాచారశాఖ డైరెక్టర్ గా కేవీఎస్ విశ్వనాథన్

02

# భగ్గుమన్న బీసీ సంఘాలు

## నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు

### బీజేపీ, బీఆర్ఎస్‌లపై కాంగ్రెస్ భగ్గు

### కాంగ్రెసే కారణమంటూ బీజేపీ కౌంటర్

**హైదరాబాద్ - మహా**

బీసీలకు అందినట్టే అంది నిలిచిన 42శాతం రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు తీవ్రంగా రియాక్టయ్యాయి. శుక్రవారం రాష్ట్రబంద్ తో పాటు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. మరోవైపు ఏడాదిన్నర కాలంగా బీసీ కులగణన, రిజర్వేషన్ల అంశం చుట్టూ తిరుగుతున్న రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు నిర్ణయంతో షాక్ కు గురికాగా, బీజేపీ బీఆర్ ఎస్ కుట్ర వల్లే స్థానిక ఎన్నికలు నిలిచిపోయాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్ అయ్యారు. బీసీ రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామని, ఇది తమ కమిట్ మెంట్ అని పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ అన్నారు. గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్ లో ఉన్నపుడు తొందరపడి జీవో ఎందుకిచ్చారని బీజేపీ చీఫ్ రామచందర్ రావు ప్రశ్నించారు. మొత్తంగా బీసీ రిజర్వేషన్ల అంశం చుట్టూ తెలంగాణ పాలిటిక్స్ హాట్ హాట్ గా మారాయి.

## బీజేపీ, బీఆర్ఎస్ కుట్రే..

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్



బీసీ రిజర్వేషన్ బిల్లు ఆపడంలో బీజేపీ, బీఆర్ఎస్ కుట్ర స్పష్టంగా కనిపించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆపింది బీజేపీ ప్రభుత్వం కాదా?, రిజర్వేషన్లు 50 శాతం మించ కుండా చట్టం చేసింది బీఆర్ఎస్ కాదా? అని ప్రశ్నించారు. ఇక్కడ ఆ రెండు పార్టీల కుట్ర స్పష్టంగా కనబడుతుందని ఫైర్ అయ్యారు. గతంలో బీఆర్ఎస్ చేసిన చట్టమే బీసీలకు ఉరితాడుగా మారిందన్నారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని చట్టం తెచ్చింది కేసీఆరేనన్నారు.

మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్తాం

### పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అందరికీ తెలుసని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను వాళ్లు గమనిస్తున్నారని చెప్పారు. బీసీల రిజర్వేషన్ల పెంపు బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఏ మాత్రం ఇష్టం లేదన్నారు. 95 సంవత్సరాల తర్వాత బీసీ కులగణన జరిగిందని, బీసీ రిజర్వేషన్లు తగ్గించి బీసీలను బీఆర్ఎస్ మోసం చేసిందని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయకారి ఒప్పందం తో బీసీల నోటి కాడి ముద్ద లాక్కున్నారని, తాము ఢిల్లీలో ధర్నా చేస్తే..

మిగతా 2లో

## కాంగ్రెస్ వల్లే కోర్టులో స్టే


### బీజేపీ చీఫ్ రామచందర్ రావు



స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో హైకోర్టు స్టే విందించేందుకు కాంగ్రెస్ పార్టీనే కారణం అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందని అసెంబ్లీలో బీసీ బిల్లుకు, ఆర్డినెన్స్ కు పూర్తి మద్దతు ఇచ్చామన్నారు. అలాగే బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఇంప్లీడ్ పిటిషన్ కూడా వేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కు బిల్లు పంపి 3 నెలలు కూడా ఓపిక పట్టలేదని, జీవో ఇచ్చి షెడ్యూల్ ప్రకటించడంలో లోగుట్టు ఏంటని ప్రశ్నించారు. కోర్టు స్టేకు ప్రభుత్వానిదే బాధ్యత అని మాపై అబండాలు వేయవొద్దన్నారు.

## మా నోటికాడి అన్నం ముద్ద లాక్కున్నారు

### ఆర్ కృష్ణయ్య



బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం అధినేత ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోతే తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. హైకోర్టు వద్ద ఆర్ కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో

## అందరం వెళ్లి ప్రధాని ఇంటి ముందు కూర్చుందాం

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల

వివరాలు 2లో


SRI GOLD

TRUSTED GOLD BUYERS


| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,24,150 |
| 22 క్యారెట్ | 1,13,800 |
| సిల్వర్ (కేజీ) | 1,67,000 |


# ఆపండి

## సర్కారు జీవోకు హైకోర్టు బ్రేక్

# స్థానిక ఎన్నికలు రద్దు

### ఉదయం నోటిఫికేషన్.. సాయంత్రం రద్దు ప్రకటన

- ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం.. హైకోర్టు ఆదేశంపై బీసీ సంఘాల ఆగ్రహం
- నేడు రాష్ట్రబంద్ కు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎంపీ ఆర్. క్రిష్ణయ్య పిలుపు
- బీసీ బిల్లుకు బీజేపీ, బీఆర్ఎస్సే అడ్డంకి పీసీసీ చీఫ్ ఫైర్




**హైదరాబాద్, మహా:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంపై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాలకు దాఖలుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా హైకోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ఆరు వారాలపాటు నిలిచిపోనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండు రోజుల పాటు సుదీర్ఘ వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీసీ కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని, స్వాతంత్ర్యం తర్వాత సమగ్ర కులగణన సర్వే తెలంగాణలోనే జరిగిందని అన్నారు. ఇంటింటికెళ్లి సర్వే చేశారని, ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో బీసీ జనాభా 57.6శాతం ఉన్నట్లు తేలిందన్న ఆయన.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు కోర్టుకు వివరించారు. బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనం ఉందని గుర్తించే.. అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. మరో న్యాయవాది రవివర్మ తన వాదనలు వినిపిస్తూ... రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50శాతం సీలింగ్ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారని, 85 శాతం జనాభాకు 42 శాతంతో కలిపి 67 శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నామని వివరించారు. 15 శాతం జనాభాకు 33 శాతం ఓపెన్‌గానే ఉందన్నారు.

మిగతా 2లో



## ట్రంప్‌కు మోదీ ఫోన్

### గాజా శాంతి ప్రణాళిక విజయంపై అభినందనలు

**మహా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ఫోన్‌లో సంభాషించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. చరిత్రాత్మక గాజా శాంతి ప్రణాళిక విజయవంతం కావడానికి కృషి చేసినందుకు ట్రంప్‌నకు అభినందనలు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాణిజ్య చర్చల్లో సాధించిన పురోగతిపైనా సమీక్షించామన్నారు. రానున్న రోజుల్లో సన్నిహిత సంబంధాలు కొనసాగించేందుకు పరస్పరం అంగీకరించినట్లు 'ఎక్స్' వేదికగా మోదీ వెల్లడించారు.

| స్టాక్ మార్కెట్ | | |
|---|---|---|
| సెన్సెక్స్ | ↗ | 82,172.10 |
| నిఫ్టీ | ↗ | 25,181.80 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.2 | 156 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.2 | 156 |
| రిటైల్ గుడ్డు ధర | 5.51 | 165.36 |

**ఈరోజు చికెన్ ధరలు**

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర | 180 | 220 | 230 |
| హోల్ సేల్ ధర | 160 | 200 | 210 |



## సీఎంను కలిసిన నవీన్ యాదవ్

### అభ్యర్థిత్వం ఖరారుపై థ్యాంక్స్

**హైదరాబాద్, మహా:** జూబ్లిహిల్స్ అభ్యర్థిగా తనను ఖరారు చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. మంచి మెజారిటీతో గెలిచి రావాలని సీఎం రేవంత్ ఈ సందర్భంగా ఆశీర్వదించారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్ , వివేక్ తో పాటు పలువురు నేతలను కలిసిన నవీన్ యాదవ్ తన అభ్యర్థిత్వం ఖరారుకు సహకరించి నందుకు థ్యాంక్స్ చెప్పారు. మరోవైపు నవీన్ యాదవ్ అభ్యర్థిత్వం ఖరారు కావడంతో జూబ్లిహిల్స్ లో కోలాహలం నెలకొంది.

## రియల్ బాద్ షా హైదరాబాద్

- భూముల వేలాల్లో.. తగ్గేదెలే అంటున్న బిడ్డర్లు
- కూకట్ పల్లి హౌజింగ్ బోర్డుస్థలానికి రికార్డు ధర
- 1.50 లక్షల రేటును పోటీపడి.. డబుల్ చేసిన బిడ్డర్లు
- హైదరాబాద్ స్థలాలకు తీవ్ర పోటీ



**హైదరాబాద్, మహా:**

హైదరాబాద్ లో రియల్ బూమ్.. ట్రాక్ ఎక్కింది. ఇక తగ్గేదెలే అంటోంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సరికొత్త రికార్డులు నమోదవుతున్నాయి. ఇటీవల రాయదుర్గంలో ఎకరం రూ.177 కోట్లు పలికి దేశవ్యాప్తంగా వావ్ అంటూ ఉలిక్కిపడేలా చేసింది. గతంలో కోకాపేటలో ఎకరం రూ.100 కోట్లు పలకగా.. సర్కార్ వేలంలో ఇటీవల రాయదుర్గంలోని 7 ఎకరాల బిట్ రికార్డు స్థాయిలో ఎకరం రూ.177 కోట్ల చొప్పున పలికింది.

మిగతా 2లో

## బీజేపీ అభ్యర్థిగా బొంతు?

02

# ఆపండి

## సర్కారు జీవోకు హైకోర్టు బ్రేక్

# స్థానిక ఎన్నికలు రద్దు

### ఉదయం నోటిఫికేషన్.. సాయంత్రం రద్దు ప్రకటన

ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం.. హైకోర్టు ఆదేశంపై బీసీ సంఘాల ఆగ్రహం

నేడు రాష్ట్రబంద్ కు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎంపీ ఆర్. క్రిష్ణయ్య పిలుపు

బీసీ బిల్లుకు బీజేపీ, బీఆర్ఎస్సే అడ్డంకి పీసీసీ చీఫ్ ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

వాదనలు విన్న ధర్మాసనం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎలక్షన్ ప్రక్రియకు బ్రేక్ పడింది.

**స్థానిక ఎన్నికలు రద్దు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 29న విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేసినట్లు ప్రకటించింది. హైకోర్టు ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ అమలు, నామినేషన్ల ప్రక్రియను నిలిపివేసినట్లు తెలిపింది. తదుపరి నోటిఫికేషన్ ఇచ్చేవరకు ఎన్నికల ప్రక్రియలన్నీ నిలిపివేసినట్లు ప్రకటించింది. స్థానిక ఎన్నికల రద్దుతో రిజర్వేషన్‌తో సంబరపడ్డ వారు నిరాశకు గురికాగా, రిజర్వేషన్లతో అవకాశాలు దెబ్బతిన్నవారు సంతోషపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా రిజర్వేషన్ల చర్చ హాట్ టాపిక్ గా మారింది.

**భగ్గుమన్న బీసీ సంఘాలు**

హైకోర్టు ఆదేశంపై బీసీ సంఘాలు భగ్గుమన్నాయి. బీసీల నోటికాడ కూడు లాక్కున్నారంటూ బీసీ నేతలు తీవ్రస్థాయిలో భగ్గుమనగా, రిజర్వేషన్ల కోసం గట్టిగా ప్రయత్నించిన కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ, బీఆర్ ఎస్ టార్గెట్ గా విమర్శలు గుప్పించింది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వ తీర్పును నిరసిస్తూ బీసీ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న రాష్ట్రబంద్ కు పిలుపునిచ్చారు. ఎంపీ ఆర్ .క్రిష్ణయ్య కూడా రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చారు. 30 ఏళ్ళుగా బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్నామన్నారు.

# ఏపీలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

## ఒకేసారి 31 మందికి స్థానచలనం

### సమాచారశాఖ డైరెక్టర్ గా కేఎస్ విశ్వనాథన్

**అమరావతి, మహా:** ఏపీలో కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పాలనా వ్యవస్థలో కీలకమైన ఐఏఎస్ లలో 31 మందిని ఒకేసారి బదిలీ చేసింది. ఇందులో పలువురు డైరెక్టర్లు, కార్యదర్శులు, సబ్ కలెక్టర్లు కూడా ఉన్నారు. వీరిలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కొంతమందికి పోస్టింగ్ లు కూడా దక్కాయి. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కేవీఎన్ చక్రధర్ బాబును వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ గా నియమించారు. మంజీర్ జిలానీని ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఎండీ, మార్క్ ఫెడ్ ఎండీగా కూడా బాధ్యతలు అప్పగించారు. రవి సుభాష్‌ను ఏపీపీఎస్సీ కార్యదర్శిగా నియమించారు. శివశంకర్ ను ఏపీఎస్పీడీపీఎస్ ఎండీగా నియమించారు. వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీ రావును పౌరసరఫరాల కార్పోరేషన్ ఎండీగా నియమించారు.ఇంటర్ బోర్డు డైరెక్టర్ గా రంజిత్ బాషాను, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీగా అరుణ్ బాబును, సీసీఎల్ఏ అదనపు కార్యదర్శిగా జేవీ మురళిని, సీసీఎల్ ఏ సంయుక్త కార్యదర్శిగా చేతన్ ను, వేర్ హౌసింగ్ కార్పోరేషన్ ఎండీగా నవ్యను, ఎయిర్ పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఎండీగా ప్రవీణ్ ఆదిత్యను, సమాచారశాఖ డైరెక్టర్ గా కేఎస్ విశ్వనాథన్ ను, పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ గా గోవింద రావును, ఎస్సీ కమిషన్ కార్యదర్శిగా చిన్న రాముడిని, ట్రాన్స్ కో జేఎండీగా ప్రవీణ్ చంద్ ను నియమించారు. అలాగే బాపట్ల జేసీగా భావనకు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప కార్యదర్శిగా విష్ణు చరణ్ కు, వైద్యారోగ్యశాఖ డిప్యూటీ సెక్రటరీగా శోభికకు, మారిటైమ్ ఇన్ ఫ్రా డెవప్మెంట్ కార్పోరేషన్ ఎండీ, డైరెక్టర్ గా అభిషేక్ కుమార్ కు, నంద్యాల జేసీగా కార్తీక్ కు, పరిశ్రమలశాఖ డైరెక్టర్ గా శుభం బన్సల్ కు, ఏలూరు జేసీగా అభిషేక్ గౌడకు, కర్నూలు జేసీగా నూరుల్ కామర్ కు, రాజమండ్రి కమిషనర్ గా రాహుల్ మీనాకు, కాకినాడ జేసీగా అపూర్వ భరత్ కు, సత్యసాయి జిల్లా జేసీగా మౌర్య భరద్వాజ్ కు, హౌసింగ్ శాఖ కార్యదర్శిగా వెంకట్ త్రివినాగ్ కు, డైరీ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఎండీగా మురళీధర్ కు పోస్టింగ్స్ ఇచ్చారు. వీరితో పాటు లిడ్ క్యాప్ వీసీ, ఎండీగా ప్రసన్న వెంకటేష్‌కు, శాప్ ఎండీగా భరణికి, అల్లూరి సీతారామరాజు జిల్లా జేసీగా శ్రీపూజకు అవకాశం కల్పించారు.

# రిజర్వేషన్ల జీవోతో కొత్త నాటకం

- ఆరు గ్యారెంటీల లాగే బీసీ రిజర్వేషన్ల డ్రామా
- ఢిల్లీ వేదికగా కొట్లాట పెట్టండి.. కలిసి రావడానికి బీఆర్ఎస్ ఎల్లప్పుడూ సిద్ధమే
- మాజీ మంత్రి హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే జారీ చేయడం పట్ల మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. ఆరు గ్యారెంటీల లాగే, కాంగ్రెస్ 42 శాతం బీసీ రిజర్వేషన్ల డ్రామా ఆడుతుందని విమర్శించారు. 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉండి కాంగ్రెస్ ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటు పడిందా..? అని ప్రశ్నించారు. చిత్తశుద్ధి ఉంటే మీ కాంగ్రెస్ జాతీయ నాయకులతో ఢిల్లీ వేదికగా కొట్లాట పెట్టండి.. కలిసి రావడానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ సిద్ధం అన్నారు. మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ..ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్ది పొందాలని చేసిన కుట్రలు హైకోర్టు ఆదేశాలతో పటాపంచలయ్యాయని విమర్శించారు. 22 నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన సీఎం రేవంత్ రెడ్డి గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా క్రియేట్ చేశారు తప్ప, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధించడం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదు అని హరీష్ రావు ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి డ్రామాలు ఆపాలి.. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం, 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు చట్టబద్ధత కోసం కేంద్రాన్ని పట్టుబట్టాల్సిన రేవంత్ రెడ్డి.. దీన్నీ తెలివిగా దాన్ని పక్క దోవ పట్టించారు అని విమర్శించారు. బీసీల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్త నాటకానికి తెరతీశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి డ్రామాలు ఆపాలని, మీకు, మీ పార్టీకి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే 42 శాతం పెంపు విషయమై ఢిల్లీలో కొట్లాడాలన్నారు. పార్లమెంట్‌లో చట్టం చేయించి, షెడ్యూల్ 9లో చేర్చండి అని హరీష్ రావు డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పోరాటంలో అఖిల పక్షాలను భాగస్వామ్యం చేయండి. ఢిల్లీ వేదికగా యుద్ధ భేరి మోగించండి. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ బీసీల కోసం గొంతెత్తుతుంది. ఢిల్లీని నిలదీస్తుందన్నారు.

# రియల్ బాద్ షా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

ఇపుడు కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు పశ్చిమ డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలం ఈవేలంలో రికార్డు రేటు పలికింది. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ రోడ్డుకు సమీపంలో ఉన్న ఈ స్థలానికి బుధవారం నిర్వహించిన ఈవేలంలో అంచనా వేసిన దానికంటే అధిక ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. రాజీవ్ రోటరీ సమీపంలో.. ఒక నాలాను ఆనుకుని ఉన్న 726 గజాల స్థలాన్ని హౌసింగ్ బోర్డు వేలం వేసింది. హౌసింగ్ బోర్డు ఈ స్థలానికి బేస్ ప్రైస్ గజానికి రూ.1.50 లక్షలుగా నిర్ణయించింది. అయితే వేలంలో బిడ్డర్లు తీవ్రంగా పోటీ పడటంతో.. చివరికి ఆ స్థలం గజానికి రూ.2,47,500 చొప్పున అమ్ముడుపోయింది. ఈ వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏకంగా రూ.17,96,85,000 ఆదాయం సమకూరింది.

**హైదరాబాద్ రియల్ డిమాండ్ తగ్గేదెలే**

జనావాసాలు ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ, జేఎన్‌టీయూ వంటి అత్యంత కీలకమైన వాణిజ్య, నివాస ప్రాంతంలో ప్రభుత్వ స్థలానికి ఇంత పెద్ద ధర పలకడం.. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో డిమాండ్ ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తుంది. ప్రధాన రహదారికి దగ్గరగా, కీలకమైన జంక్షన్‌కు సమీపంలో ఉండడం ఈ స్థలం విలువను పెంచింది. ఈవేలం నిర్వహించడం వల్ల ప్రభుత్వానికి అనుకున్న దానికంటే ఎక్కువ ఆదాయం లభించింది. హౌసింగ్ బోర్డు వంటి ప్రభుత్వ సంస్థలు నిర్వహించే ఈవేలంలో స్థలాలను కొనుగోలు చేయడానికి ప్రజలు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేట్ భూములతో పోలిస్తే ప్రభుత్వ స్థలాలకు అధిక డిమాండ్ ఉండటానికి పలు కారణాలు ఉన్నాయని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములకు సాధారణంగా యాజమాన్య పత్రాలు (టైటిల్ డీడ్స్) స్పష్టంగా పారదర్శకంగా ఉంటాయి. ప్రైవేట్ స్థలాల్లో తరచూ తలెత్తే కోర్టు కేసులు, భూ వివాదాలు, వంటి చిక్కులు ప్రభుత్వ స్థలాల్లో దాదాపుగా ఉండవు. ఇది కొనుగోలుదారులకు భద్రతా భావాన్ని కలిగించి, పెట్టుబడిపై పూర్తి విశ్వాసం ఏర్పరుస్తుందని చెబుతున్నారు. కేపీహెచ్‌బీ హైటెక్ సిటీ వంటి ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న స్థలాలకు రికార్డు ధరలు పలకడానికి ఇది ముఖ్య కారణంగా నిపుణులు చెబుతున్నారు. మొత్తంగా రాష్ట్రసర్కారు వేలాలకు ఇపుడు ఎన్నడూ లేని రీతిలో స్పందన కనిపిస్తుండడంతో ఇక రియల్ రంగానికి మళ్ళీ పాతరోజులు వస్తున్నాయని క్రయవిక్రయదారులు సంతోషపడుతున్నారు.

# బీజేపీ అభ్యర్థిగా బొంతు?

## ప్రతిపాదించిన ఎంపీ అరవింద్.. జూబ్లిహిల్స్ పాలిటిక్స్ లో ట్విస్ట్.. స్పందించిన మాజీ మేయర్



**హైదరాబాద్, మహా:** జూబ్లిహిల్స్ బీజేపీ అభ్యర్థి ఖరారు విషయంలో సంచలన ట్విస్ట్ చోటు చేసుకుంది. కాంగ్రెస్ నేత, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరును నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పార్టీ ముందు ప్రతిపాదించారు. ఆయన పేరును పరిశీలించాలని అర్వింద్ కోరినట్లు సమాచారం. రామ్మోహన్ గతంలో ఏబీవీపీలో పని చేశాడని.. మనవాడని పార్టీ నేతలకు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి అర్వింద్ వివరించినట్లు తెలుస్తోంది. అర్వింద్ చేసిన ప్రతిపాదనపై బీజేపీ హైకమాండ్ ఎలా స్పందిస్తుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు ఈ ప్రతిపాదన సంచలనంగా మారగా, దీనిపై బొంతు స్పందించారు. బీజేపీ టికెట్ కోసం ఆరుగురు పోటీ పడుతున్నారు. పోటీలో ప్రధానంగా ఆకుల విజయ, కీర్తిరెడ్డి, లంకల దీపక్ రెడ్డి, వీరపనేని పద్మ, మాధవీలత ఉన్నారు.

**పోటీలో నేను లేను**

జూబ్లీహిల్స్ బైపోల్ బరిలో తాను లేనన్న బొంతు రామ్మోహన్.. బీజేపీ నుంచి పోటీ చేస్తానన్న వార్తలు అవాస్తవమని అన్నారు. తన అభ్యర్థిత్వంపై బీజేపీ అంతర్గత చర్చకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, ఉంటానని తేల్చి చెప్పారు. కాంగ్రెస్‌లో తాను సంతృప్తికరంగా ఉన్నానని బొంతు రామ్మోహన్ వెల్లడించారు.

### న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో

# హైదరాబాద్ పోటీ

## 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలి

- హైదరాబాద్‌లో గేమ్‌ఛేంజర్ ప్రాజెక్టులు, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్
- అమెరికా–భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలి: సీఎం రేవంత్
- అమెరికా ప్రతినిధుల బృందంతో తన అభిప్రాయాలను పంచుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి



**హైదరాబాద్, మహా:** అమెరికా నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో అమెరికా-భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని సీఎం రేవంత్ ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాలు, హెచ్ 1 బీ వీసాలపై విధించిన కఠిన నిబంధనలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుండటమే కాక అస్థిరత, అపార్థానికి దారి తీస్తాయని చెప్పారు. రెండు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శంగా ఉంటాయని పేర్కొన్నారు. తెలంగాణకు వచ్చిన అమెరికా ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి తన అభిప్రాయాలను పంచుకున్నారు. హడ్సన్ ఇనిస్టిట్యూట్ కు చెందిన ప్రతినిధులు, వివిధ రంగాల మేధావులు, బిజినెస్ లీడర్లు, దాతలతో కూడిన అమెరికన్ ప్రతినిధి బృందం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పరిశ్రమలు అండ్ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేంద్ర రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో ఈ అమెరికన్ ప్రతినిధి బృందం భారత్‌లోని పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార, వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై అభిప్రాయాలు స్వీకరిస్తోంది. సమావేశంలో ముఖ్యమంత్రి తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాలకులు మారినా విధానాలను మార్చవలసిన అవసరం లేదని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో ఉత్తమమైన విధానాలను ప్రభుత్వం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడుల గమ్యస్థానంగా, ప్రపంచ నగరంగా ఆకర్షణగా మారిందని, దేశీయవిదేశీ దిగ్గజ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో పోటీ పడుతోంది, మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యాలను మెరుగుపరచడం ప్రపంచ ప్రమాణాలకు సవాలుగా ఉందని అన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ అనూహ్య పురోగతి సాధించిందని, 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలని, 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉందని తెలిపారు. హైదరాబాద్‌లో గేమ్‌ఛేంజర్ ప్రాజెక్టులు, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్, మాన్యుఫాక్చర్ జోన్లు అభివృద్ధి జరుగుతున్నాయని, డ్రై పోర్ట్ ఏర్పాటు చేసి మచిలీపట్నం పోర్ట్ వరకు 12లేన్ గ్రీన్ ఫీల్డ్ హైవే, రైల్ కనెక్టివిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనలు ఉన్నాయని, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు కొత్త మార్గాలను తెరవనున్నట్లు తెలిపారు. 30,000 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వామ్యాన్ని, మద్దతును ఆహ్వానిస్తున్నారని అన్నారు ఇప్పటికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపెనీలు హైదరాబాద్ లో ఉన్నాయని, మొత్తం 500 కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. 'చైనా +1' వ్యూహానికి తెలంగాణ అత్యుత్తమ ఎంపికగా ఉందని, భవిష్యత్తు ప్రణాళికలను ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. హైదరాబాద్‌లో ఏఐ సిటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని, రాష్ట్రాన్ని దేశానికి స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలనే కార్యక్రమాలు చేపడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ప్రముఖ కంపెనీలు హైదరాబాద్ లో గ్లోబల్ కెపాసిటీ సెంటర్స్ ఏర్పాటు చేశాయని, వీటిని గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు, అలాగే హైదరాబాద్ కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్ వ్యాక్సిన్‌ల సరఫరాలో ప్రధాన పాత్ర పోషించాయని గుర్తుచేశారు. హడ్సన్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు, వాల్ స్ట్రీట్ జర్నల్ కాలమిస్ట్ ప్రొఫెసర్ వాల్టర్ రస్సెల్ మీడ్, రేషనల్‌వేవ్ క్యాపిటల్ పార్టనర్స్ సీఈవో మార్క్ రోసెన్‌బ్లాట్, క్రౌ హోల్డింగ్స్ చైర్మన్ హర్లాన్ క్రో, ఈగిల్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు రావెనెల్ కరీ, బిల్లింగ్స్లీ కంపెనీ భాగస్వామి హెన్రీ బిల్లింగ్స్లీ సహా మొత్తం 16 మంది అమెరికా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ఎస్ కుట్రే..

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

గురువారం గాంధీ భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఇతర ముఖ్య నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. '42 రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం... తెలంగాణ మోడల్ దేశం మొత్తం అమలు చేసేలా మా కార్యాచరణ ఉంటుంది. ఢిల్లీలో మేమంతా ధర్నా చేసిన రోజు బీఆర్ఎస్ నేతలు అంతా ఎక్కడ ఉన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కు చట్టబద్ధంగా చేయవలసిన పక్రియ అంతా ప్రభుత్వం చేసింది. సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికల పక్రియ మొదలు పెట్టాలని కోర్టు ఆదేశించింది. బీసీ రిజర్వేషన్లు పెంచే ఆలోచన గత బీఆర్ఎస్ ప్రభుత్వంకు ఉంటే ఎందుకు కులగణన చేయలేదు. బీసీలు అమాయకులు కాదు...బీసీ రిజర్వేషన్ల పెంపు ఎంత కఠినమైనదో తెలుసు. మా ప్రభుత్వం ఏర్పాటు కాగానే బీసీ రిజర్వేషన్ల పెంపు పక్రియ చేపట్టాం' అని తెలిపారు.

### బీసీ రిజర్వేషన్లు ఇచ్చాకే

# ఎన్నికలకు వెళ్తాం

## పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎక్కడ ఉన్నారని నిలదీశారు. బీఆర్ఎస్ కాప్ లిమిట్ పెడుతూ చట్టం చేసి అడుగడుగున బీసీలను అణగదొక్కిందని ఫైర్ అయ్యారు. తమకు చిత్తశుద్ధి ఉంది కాబట్టి కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించి ఆదిశగా ముందుకు పోతున్నామని స్పష్టం చేశారు. ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు జరగాల్సి ఉన్న రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సీఎం రేవంత్, కేబినెట్ మంత్రులు, పార్టీ అంత ఢిల్లీ వెళ్లి ధర్నా చేశామని.. బీసీ సంఘాలు కుల సంఘాలు ధర్నా చేస్తే బీజేపీ, బీజేపీ లు ఎందుకు చేయలేదని నిలదీశారు. ఎట్టి పరిస్థితుల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని, బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. ఢిల్లీలో పోరాడినప్పుడు మీరు ఎక్కడ తోక ముడుచుకొని తలదాచుకున్నారు? అని నిలదీశారు. కోర్టులో పోరాటం చేస్తుంటే ఎందుకు మీరు ఇంప్లీడ్ కాలేదు. బీసీలకు వ్యతిరేకంగా ఉన్న మీరు చరిత్రలో ద్రోహులుగా మిగిలిపోతారు అని మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు.

### మా నోటికాడి అన్నం

# ముద్ద లాక్కున్నారు

## ఆర్ కృష్ణయ్య

'ఎన్నికల ప్రక్రియను రెండు వారాల పాటు ఆపడమనేది దురదృష్టకరం. ఎందుకంటే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికలను ఆపొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా రెండు వారాల పాటు ఎన్నికలను వాయిదా వేయడం తాము తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 56 శాతం బీసీ ప్రజల హక్కులకు విఘాతం కలిగిస్తుంది. బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. నోటికాడి అన్నం ముద్దను లాక్కున్నారు. మొన్న నుంచి విచారణ జరిపిన కోర్టు.. మరో రెండు రోజులు సమయం తీసుకుని ఇంకా విస్తృతంగా విచారణ చేపట్టాల్సి ఉండే. ఎందుకు ఆదరబాదరగా స్టే విధించాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం' అని ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందన ఏంటో చూస్తాం. తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి రాష్ట్రాన్ని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. బీసీల్లో ఎంతో చైతన్యం వచ్చింది.. ఊరూరా స్పందన తెలుపుతాం. సీఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. సాయంత్రంలోగా ప్రకటించాలి. లేదంటే పెద్ద ఎత్తున బంద్ నిర్వహిస్తాం. దేశాన్ని కదిలించేలా బంద్ ఉంటుంది. ఏం తమాషాగా ఉందా..? బీసీలంటే అంత చులకనగా ఉందా..? ముఖ్యమంత్రి పదవులు రావు మంత్రి పదవులు రావు.. లేక లేక సర్పంచ్ అవకాశం వస్తే వాటిని కూడా లాగేసుకోవడం సరికాదు. ఈ సమాజంలో బీసీల సత్తా ఏంటో చూపిస్తాం. స్టే విధించడం చాలా దురదృష్టకరం. రేపట్నుంచి రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు.

### అందరం వెళ్లి ప్రధాని ఇంటి

# ముందు కూర్చుందాం

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీ ఇంటి ముందు కూర్చుందాం అని మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తామంటే తామూ వెంట వస్తామని వెల్లడించారు. ప్రధానిని కలవడమే దీనికి పరిష్కారమని.. 42 శాతంపై వెనక్కి పోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. 42 శాతం అమల్లోకి వచ్చాకనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని.. ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ బీఆర్ఎస్ విధానాన్ని స్పష్టంగా చెప్పామని అన్నారు. జీవో ద్వారా సాధ్యం కాదని.. రాజ్యాంగ సవరణ జరిగితేనే ఫలితం ఉంటుందని చెప్పామని.. అయినా పట్టించుకోలేదని అన్నారు. బీసీలను అవమానం చేసేలా వ్యవహరించారని.. జీవో న్యాయస్థానంలో నిలబడదని సీఎం, మంత్రులు, అందరికీ తెలుసని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు జరపాల్సిందేనని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాకే బీసీ రిజర్వేషన్లు పెంచుతామన్న రేవంత్‌రెడ్డి జీఓ ఎందుకు ఇచ్చారని నిలదీశారు.

# హైదరాబాద్‌లో రూ. 10 కోట్ల డ్రగ్స్ సీజ్

## జీడిమెట్లలో 220 కిలోల ఎఫిడ్రిన్‌ను స్వాధీనం



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సుమారు 10 కోట్ల విలువైన డ్రగ్స్ ను పోలీసులు స్వాధీనం చేసుకన్నారు. ఎఫిడ్రిన్ అనే డ్రగ్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఒక అపార్ట్‌మెంట్ వేదికగా ఐదురుగు కలిసి డ్రగ్స్ తయారీ చేస్తున్న సమాచారం అందుకున్న ఈగల్ టీమ్.. ఈ మేరకు సోదాలు నిర్వహించింది. జీడిమెట్ల పరిధిలోని సుచిత్రా క్రాస్ రోడ్స్ సమీపంలోని స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో సాయి దత్తా రెసిడెన్సీలో 220 కేజీల డ్రగ్స్‌ను ఈగల్ టీమ్ గుర్తించింది. ఈ ఘటనకు సంబంధించి నలుగుర్ని అరెస్ట్ చేయగా, ఒకరు పరారయ్యారు. ఈ డ్రగ్స్ విలువ స్థానిక మార్కెట్ లో రూ. 10 కోట్లకు పైగానే ఉంటుందని, అదే అంతర్జాతీయ మార్కెట్ లో అయితే రూ. 70 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అపార్ట్‌మెంట్ వేదికగా డ్రగ్స్ తయారు చేస్తున్న వారిలో వాస్తవాయి శివరామకృష్ణ పరమవర్మ, దంగేటి అనిల్, మద్దు వెంకట కృష్ణ, ఎం ప్రసాద్, ముసిని దొరబాబులు ఉన్నారు. వీరంతా కాకినాడ, తూర్పుగోదావరి, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు గుర్తించారు.

# ఎన్నటికైనా కేసీఆర్‌కు హరీశ్ రావే వెన్నుపోటు

## నన్ను కేసీఆర్ పిలిచినా మళ్లీ వెనక్కి వెళ్లేది లేదు.. ఎమ్మెల్సీ కవిత హాట్ కామెంట్స్



**హైదరాబాద్, మహా:** తన మనసు విరిగిపోయిందని తిరిగి కేసీఆర్ పిలిచినా మళ్లీ వెనక్కి వెళ్లబోయేది లేదని కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు, సంతోశ్‌రావు ఎవరి కోటరీ వారికి ఉందని ఆరోపించారు. ఈ కోటరీనుంచి పార్టీ ఎమ్మెల్యేలను, నేతలను కాపాడాల్సిన బాధ్యత వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దేనన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఎప్పటికైనా హరీశ్ రావు ముప్పుగానే ఉంటారని ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. ఎన్టీఆర్‌కు చంద్రబాబు నాయుడు ఎలా వెన్నుపోటు పొడిచారని ప్రజలు చెప్పుకుంటారో కేసీఆర్‌కు హరీశ్ రావు అలాగే వెన్నుపోటు పొడిచారని ప్రజలు మాట్లాడుతారన్నారు. కేసీఆర్‌కు హరీశ్ రావు వెల్ విషర్ అని నేను అనుకోవడం లేదని ఈ విషయం కేసీఆర్ అర్థం చేసుకుంటే బాగుంటుందన్నారు. రాబోయే రోజుల్లో రాజకీయంగా ఎదురుగా ఎవరున్నా పోరాటం చేయాల్సిందేనని అది కేసీఆర్, కేటీఆర్ ఎవరైనా సరేనన్నారు. కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఆర్ఎస్‌ను కూడా సమ దూరం పాటిస్తామన్నారు. అవతల కేసీఆర్, కేటీఆర్ ఉంటే నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినప్పుడు కూడా ఇవన్నీ వారు ఆలోచించుకోవాల్సింది కదా అన్నారు.



## అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**యాదాద్రి భువనగిరి, మహా:** భువనగిరిలోని ఐటిఐ ఆవరణలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు గురువారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సాంకేతిక కోర్సులలో శిక్షణ పొందడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని అన్నారు ఏ టీ సి సెంటర్ లో ఎంత మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఏ ఏ కోర్సుల్లో విద్యార్థులు శిక్షణ ఇస్తున్నారని.విద్యార్థులకు అన్నివసతులు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. విద్యార్థులు అందరూ కూడా కష్టపడి శ్రద్ధ తో ట్రైనింగ్ పూర్తి చేసుకోవాలని సూచించారు . రాబోయే కాలంలో మొత్తం ఈ అడ్వాన్స్డ టెక్నాలజీ రంగంలో జాబ్ లు ఉంటాయని అన్నారు. డిగ్రీ ఇతర చదువుల ద్వారా మాత్రమే కాకుండా సాంకేతిక విద్య ద్వారా ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ప్రైవేటు ఉద్యోగాలు కూడా పొందవచ్చును అన్నారు. ఏటీసీలో శిక్షణ పొందిన వారికి భవిష్యత్ బాగుంటుందని అన్నారు.



# రూ.1 పెట్టుబడికి 4 రూపాయల లాభం

- **తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక -2035**
- **కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన పుస్తకం**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పుస్తకం ఆవిష్కరణ**

**హైదరాబాద్, మహా:** కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన 'తెలంగాణ రాష్ట్ర ఉద్యాన అభివృద్ధి ప్రణాళిక 2035' పుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఉద్యాన పంటల ఉత్పత్తిని పెంచడానికి 2035 వరకు అనుసరించాల్సిన లక్ష్యాలను ఈ ప్రణాళికలో నిర్దేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం లో ముఖ్యమంత్రి ఈ ప్రణాళికను ఆవిష్కరించగా, ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణా రావు, విశ్వవిద్యాలయం వైస్ చాన్సెలర్ డి. రాజిరెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు. రాబోయే 5 సంవత్సరాల్లో 1.32 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు, 2.45 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటల విస్తీర్ణం, దిగుబడులు, ఉత్పత్తి పెంచడం లక్ష్యంగా ప్రణాళికలో నిర్దేశించారు.

**ఏటా 1341 కోట్ల రూపాయల ఉత్పత్తి..**

వచ్చే ఐదేళ్లలో రూ. 921.40 కోట్ల సాగు పెట్టుబడి, అలాగే రూ. 942.50 కోట్లు డ్రిప్ కోసం పెట్టుబడి విస్తీర్ణం పెంచగలిగితే 1 రూపాయి పెట్టుబడికి 4 రూపాయల లాభాలకు అవకాశం ఉందని ప్రణాళిక పేర్కొంది. ఎస్‌కేఎల్‌టీహెచ్‌యూ రూపొందించిన రకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రస్తుత విస్తీర్ణంలో అమలు చేయడం వల్ల ఏటా 1341 కోట్ల రూపాయల ఉత్పత్తి విలువను సాధించవచ్చని అంచనా వేసింది. వివిధ పంటల్లో మిగులు, ఉత్పత్తి లోటు ప్రాతిపదికగా తీసుకుని కార్యాచరణను అమలు చేయాలని, మిగులు ఉత్పత్తి ఉన్న పంటలు, లోటు ఉత్పత్తి ఉన్న పంటలు, అందుకు అనుగుణంగా విస్తీర్ణం పెంచడం, ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంచడం, పంట యాజమాన్యం, మార్కెటింగ్ వంటి అంశాలను ప్రణాళికలో సమగ్ర వివరించారు.

# వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు



- **బీసీ బిడ్డలు అధైర్యపడొద్దు.. రిజర్వేషన్లు ఇచ్చి తీరుతాం**
- **బీఆర్ఎస్‌తో బీజేపీ కుమ్మక్కై బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంది**
- **మంత్రి వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్, మహా:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.9 అమలును నిలిపివేస్తూ.. హైకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ.. బీసీలకు రిజర్వేషన్లు అమలు కాకుండా నోటికాడ ముద్ద లాక్కునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్లకు ఎవరు అడ్డుపడుతున్నారో.. యావత్తూ తెలంగాణ ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ప్రభుత్వం బీసీలపై చిత్తశుద్ధితో రాష్ట్రంలో ఎంపారికల్ డేటా చేపట్టడం జరిగింది.. ఎంపారికల్ డేటా ఉన్నా స్టే విధించి బీసీల నోటికాడ ముద్ద లాగే ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తాం.. ఆ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాటపై కట్టుబడి ఉన్నాం.. కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఏ విధంగా ముందుకు వెళ్ళాలో ఆలోచన చేస్తామని.. బీసీ బిడ్డలు ఎవరూ అధైర్యపడొద్దన్నారు. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేవిధంగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. బిజెపి, బిఆర్ఎస్ బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా కేసులో ఇంప్లీడ్ అవ్వాలి.. లేకపోతే చరిత్రలో బీసీ ద్రోహులుగా మిగిలిపోతారన్నారు.

# సబ్‌కా సాత్ నినాదం ఓ జోక్

- **ఏడీజీపీ స్థాయి దళిత అధికారికీ న్యాయం జరగలేదు**
- **ఓ దళితుడిని మూక హత్య చేసినా ప్రధాని ఖండించలేదు**
- **కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ధ్వజం**

**ఢిల్లీ, మహా:** హరియాణాకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అమానవీయత, సామాజిక అసమానత, సానుభూతి లేమికి ఈ కేసు ఒక నిదర్శనమన్నారు. 'ఎక్స్' వేదికగా కాషాయ పార్టీపై విమర్శలు గుప్పించిన ఖర్గే.. ఆ పార్టీ విధానాలే దళిత ఐపీఎస్ మృతికి కారణమన్నారు. "ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, బలహీన వర్గాల వారికి బీజేపీ విధానాలు శాపంగా మారాయి. ఏడీజీపీ స్థాయి దళిత అధికారికీ న్యాయం జరగలేదు. సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తిపై బహిరంగంగా దాడి జరిగింది. అయినా వాళ్లు సమర్థించుకుంటున్నారు. దీంతో సబ్‌కా సాత్ నినాదం ఓ జోక్ అని అర్థం చేసుకోవాలి. ఓ దళితుడిని మూక హత్య చేసినా ప్రధాని ఖండించలేదు. ఇది కొందరి వ్యక్తులకే పరిమితం కాదు.. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని అణచివేసే అన్యాయ వ్యవస్థకు నిదర్శనం. ఇది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం" అని కాంగ్రెస్ అధ్యక్షుడు తీవ్ర స్థాయిలో స్పందించారు.

# నాకు ఎలాంటి గ్రూపులు లేవు

- **స్థానిక ఎన్నికలు ఇజ్జత్ కా సవాల్.. గెలిస్తేనే పలుకుబడి**
- **మన అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేసినట్లే...**
- **సొంత పార్టీ నేతలకు బండి సంజయ్ తీవ్ర స్థాయిలో హెచ్చరికలు**

**హైదరాబాద్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సొంత పార్టీ నేతలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేయడంతో సమానమని, అంతకంటే నీచమైన పని మరొకటి ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో ఈరోజు ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "నాకు ఎలాంటి గ్రూపులూ లేవు, బీజేపీయే నా గ్రూప్. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసమే ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలి" అని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు తమ సొంత గ్రామాల్లో, మండలాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే వారికి గౌరవం, పలుకుబడి ఉంటాయని తేల్చిచెప్పారు. అభ్యర్థుల ఎంపికపై మాట్లాడుతూ, "గెలుపు అవకాశాలే ప్రామాణికంగా సర్వే నివేదికల ఆధారంగా రాష్ట్ర నాయకత్వమే అభ్యర్థులను ప్రకటిస్తుంది. ఈ విషయంలో నా అభిప్రాయం మాత్రమే అంతిమం కాదు" అని స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ, ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, టిక్కెట్లు ఆశించే వారు నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

# బస్సు ఛార్జీల పెంపుపై నిరసన

- **ఆర్టీసీ బస్సుల్లో బస్ భవన్‌కు కేటీఆర్, హరీశ్**
- **పెంచిన చార్జీలు తగ్గించాలని ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం**

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఛలో బస్ భవన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్రమంలోనే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు ఆర్టీసీ బస్సుల్లో ఆర్టీసీ బసు భవన్ వద్దకు చేరుకున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు అక్కడికి వచ్చారు. అయితే అప్పటికే బస్సు భవన్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. బస్ భవన్‌కు వెళ్లే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయితే పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని బస్ భవన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ సర్కార్ అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను నిరసిస్తూ బీఆర్ఎస్ తరపున "చలో బస్ భవన్" కార్యక్రమానికి పిలుపునిచ్చామని కేటీఆర్ తెలిపారు. మహిళలకు ఉచితం అని చెప్పి... పురుషులకు టికెట్ల రేట్లు డబుల్ చేశారని విమర్శించారు. విద్యార్థులు బస్ పాస్ ధరలు పెంచారని మండిపడ్డారు. ఇలా ధరలు పెంచితే కుటుంబం మీద భారం పడదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఛలో బస్ భవన్ పిలుపులో భాగంగా... ఆర్టీసీ బస్ భవన్ వద్ద, నగరంలోని పలు కూడళ్ల వద్ద, బీఆర్ఎస్ నాయకులు ఇళ్ల వద్ద భారీగా పోలీసులు మోహరించారు. అయితే బీఆర్ఎస్ ముఖ్య నేతలు మాత్రం ముందుగా పిలుపు



నిచ్చిన బస్ భవన్ కార్యక్రమానికి బయలుదేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన నివాసం నుంచి రేతిఫైల్ బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావులు బస్ భవన్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ప్రభుత్వం తక్షణమే ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మధ్య తరగతి కుటుంబాలకు ధరలు పెంచి పీక్క తింటున్నారని ఆరోపించారు. మరోవైపు బీఆర్ఎస్ ఛలో బస్సు భవన్‌లో భాగంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మెహిదీపట్నం నుంచి బస్ భవన్‌కు ఆర్టీసీ బస్సులో బయల్దేరారు. పలువురు నాయకులతో కలిసి ఆర్టీసీ బస్సు ఎక్కిన హరీష్ రావు కండక్టర్ వద్ద టికెట్ తీసుకున్నారు. తన పక్కన కూర్చున ఓ విద్యార్థి బస్ పాస్‌ను పరిశీలించారు. ఈ క్రమంలోనే మెహిదీపట్నం వద్ద మీడియాతో మాట్లాడిన హరీష్ రావు... ఆర్టీసీ చార్జీల పెంపు నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ జాబ్‌లెస్ క్యాలెండర్ అయిందని విమర్శించారు. బస్ చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారని మండిపడ్డారు.ప్రతి నెల ఆర్టీసీకి ప్రభుత్వం మహాలక్ష్మి డబ్బులు చెల్లించడం లేదని, సంస్థకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వడం లేదన్నారు.

## డీసీసీలపై ఏఐసీసీ కసరత్తు

- రేపటి నుండి రంగంలోకి ఇన్ ఛార్జిలు
- ఈనెలలోనే నియామకాలు

**హైదరాబాద్, మహా:** డీసీసీల ఎంపికపై ఏఐసీసీ ఇన్ చార్జిలు రంగంలోకి దిగుతున్నారు. రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధినేత ఖర్గే మార్గనిర్దేశంతో ఏఐసీసీ ఇన్ ఛార్జులు తమకు అప్పగించిన నమూనాలో క్షేత్రస్థాయికి వెళ్ళి వివరాలు సేకరించనున్నారు. బలమైన నేతలకు, ప్రత్యర్థులకు ధీటుగా పోరాడే వారికే జిల్లా బాధ్యతలు అప్పగించాలని రాహుల్ గాంధీ నిర్దేశించారు. ఈ క్రమంలో ఒకేసారి రాష్ట్రానికి కేటాయించిన 22 మంది ఏఐసీసీ ఇన్ ఛార్జిలు రంగంలోకి దిగుతున్నారు. ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ స్థాయి నేతలనే ఏఐసీసీ ఇన్ ఛార్జిలుగా పంపింది. డీసీసీల ఎంపిక ప్రక్రియ కోసం ప్రత్యేక మోడల్ ను తయారుచేసి గుజరాత్ నుండి రాహుల్ గాంధీ అమలుచేస్తున్నారు. ఇపుడు తెలంగాణతో పాటు ఛత్తీస్ గడ్ మరో రెండు రాష్ట్రాల ఎంపిక ప్రక్రియ కూడా మొదలైంది. శనివారం నుండి డీసీసీ నియామకాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, శనివారం ఉదయం హైదరాబాద్ కు ఏఐసీసీ పరిశీలకులు చేరుకోనున్నారు. శనివారం నుంచి క్షేత్ర స్థాయి లో పర్యటించి వారం రోజులలో ఒక సమగ్రమైన నివేదిక ఏఐసీసీ కి అందజేస్తారు. తెలంగాణ రాష్ట్రంలో డీసీసీ అధ్యక్షుల నియామకం.కోసం ఏఐసీసీ 22 మంది పరిశీలకులను నియమించింది. ఈ నివేదికను పరిశీలించి ఏఐసీసీ ఈనెలాఖరుకల్లా డీసీసీలను ఫైనల్ చేసే అవకాశాలున్నాయి.



## ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఉద్యోగం

- **ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపే చట్టం అమలు చేస్తాం**
- **ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ**

**బిహార్, మహా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి. ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీల నేతలు హామీల వర్షం కురిపిస్తున్నారు. ఈ క్రమంలో తాము (ఇండియా కూటమి) అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారు. పట్నాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపే ఇందుకు సంబంధించి ప్రతిపాదిత చట్టాన్ని తీసుకువస్తామని అన్నారు. "20 ఏళ్లలో రాష్ట్ర యువతకు ఎన్డీయే ఉద్యోగాలు కల్పించలేకపోయింది.

**20 రోజుల్లోనే చట్టాన్ని తీసుకువస్తాం..**

మేం అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే చట్టాన్ని తీసుకువస్తాం. 20 నెలల్లోనే దీన్ని అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ప్రభుత్వ ఉద్యోగాలపై హామీ ఇచ్చాను. నేను అధికారంలో ఉన్న ఆ కొద్ది కాలంలోనే ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించా. నాకు ఐదేళ్ల సమయం ఉంటే ఎన్ని ఉద్యోగాలు ఇస్తానో మీరే ఊహించుకోవచ్చు" అని బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌ను కాపీక్యాట్ అంటూ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం కొన్ని నెలలుగా చేపడుతున్న కార్యక్రమాలు గత ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను పోలిఉన్నాయని ఆరోపించారు.


# తెలంగాణ రోడ్లు దేశానికే రోల్ మోడల్

## హ్యామ్ విధానంలో ఆర్&బీ రోడ్లకు మహర్దశ

- **మూడేళ్లలో పూర్తి స్థాయిలో నిర్మించాలని ప్రణాళికలు**
- **ఆర్ అండ్ బీ శాఖ సమీక్షలో భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్, మహా:** హ్యామ్ విధానంలో ఆర్ అండ్ బీ రాష్ట్ర రోడ్లకు మహర్దశ పట్టనుంది. దశల వారీగా 3 సంవత్సరాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బీ రోడ్లను పూర్తి స్థాయిలో నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. ఈ రోడ్ల నిర్మాణంలో దేశానికే రోల్ మోడల్ గా నిలపాలనే ప్రభుత్వ లక్ష్యం. ప్రధానంగా ప్రమాద రహిత రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గురువారం రాష్ట్ర సచివాలయంలో హ్యామ్ రోడ్ల నిర్మాణంపై ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో కీలక సమావేశం నిర్వహించారు. హ్యామ్ రోడ్ల ప్రపోజల్స్ కు సంబంధించిన వివరాలను స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రులకు వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దశల వారీగా హ్యామ్ రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ సర్వే నిర్వహించి ఏ రహదారులపై ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉందో ఆ రహదారులను విస్తరించి, పునరుద్ధరించాలని సూచించారు. ప్రాధాన్య క్రమంలో ఈ రోడ్లను జాబితాలో చేర్చాలని అన్నారు. వీటి నిర్మాణ క్రమంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని అన్నారు. రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. హ్యామ్ ద్వారా వచ్చే 3 ఏళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్ బీ రోడ్డు అద్దంలా చేయనున్నామని తెలిపారు. దేశానికి రోల్ మోడల్ గా నిలపాలనే లక్ష్యంతో ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని అన్నారు. యాక్సిడెంట్స్ ఫ్రీ రోడ్ల నిర్మాణంపై ప్రధాన దృష్టి సారించామని చెప్పారు. ఫేజ్ ల వారీగా హ్యామ్ రోడ్లు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. మొదటి ఫేజ్ లో సింహ భాగం హ్యామ్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అందులో సింగిల్ లేన్, డబుల్ లేన్, 4 లేన్ల వారీగా రోడ్ల బలోపేతం చేయనున్నామని, దీంతో పాటు రోడ్ల విస్తరణ చేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ లేన్, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి 4 లేన్ రోడ్ల నిర్మాణం చేయాలని ప్రభుత్వం ధృఢ సంకల్పంతో ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. ఇందులో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇంకో అసెంబ్లీ నియోజక వర్గానికి కనెక్టివిటీ కారిడార్లుగా హ్యామ్ రోడ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మొదటి ఫేజ్ కు ఒకటి, రెండు నెలల్లో టెండర్లు పిలవనున్నట్లు మంత్రి వెల్లడించారు. హ్యామ్ విధానంలో మొదటి ఫేజ్ లో 5,587 కిలోమీటర్ల రహదారుల పునరుద్ధరణకు రూ.10,986 కోట్లు ఖర్చు చేసేందుకు అంచనాలు రూపొందించారు. వీటిలో రూ.4,416 కోట్లతో సింగిల్ లేన్, డబుల్ లేన్, 4 వరుసల రహదారులు నిర్మించేందుకు ఖర్చు చేయనున్నారు. రూ.4,416 కోట్లతో మొత్తం 3,792 కిలోమీటర్ల రోడ్లను పునరుద్ధరించనున్నారు. 1,795 కిలోమీటర్ల విస్తరణ పనుల కోసం రూ.6,569 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అంచనాలు వేశారు. ప్రధానంగా మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రెండు వరుసల రోడ్లు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు వరుసల రోడ్లు నిర్మాణం చేయాలని రోడ్డు భవనాల శాఖ సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి ఉంచింది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి కాగానే హ్యామ్ రోడ్లకు సంబంధించిన టెండర్లు ఖరారు చేయడం, పనుల కేటాయింపు తదితర పనులు మొదలు పెట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.


ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO: APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919



Exclusive
Designer Diamond
Jewellery
manepally®
Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
GIA
* THE GOLDEN BONDINGS FOR AGES *
BIS HALLMARK JEWELLER
General Bazar
9912010888
Punjagutta
7893800555
Kukatpally
8897387888
Dilsukhnagar
6309111699
Chandanagar
8712690020
Suchitra Circle
8712690030
www.manepally.com * online@manepally.com * follow us on / manepallyjewellers

# జాతీయ రహదారి విస్తరణ వేగం పెంచాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ ప్రక్రియను బేగం పెంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభావిత గ్రామాలలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. ఆర్బిట్రేషన్ సంబంధిత రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మీసేవ మేనేజర్‌పై ఫిర్యాదు

**మందమర్రి తాసిల్దార్ కు ప్రజా సంఘాల ఫిర్యాదు**



**మందమర్రి, మహా :** గత కొంతకాలంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మందమర్రి మీసేవ మేనేజర్ ఉపేందర్ పై ఫిర్యాదు అఖిలపక్షం నేతలు ఆకారం రమేష్, గుడికందుల రమేష్, బండి శంకర్, మాయ రమేష్, రాయబారపు కిరణ్, శశిధర్ లు స్థానిక తాసిల్దార్ సతీష్ కుమార్ కు గురువారం లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందమర్రి మున్సిపాలిటీ ఆవరణలో ఉన్న మీసేవ కేంద్రం మేనేజర్ గత కొంతకాలంగా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సేవల కొరకు మీ సేవకు వచ్చే ప్రజలపై దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. అలాగే సమయపాలన లేకుండా తన విధులు నిర్వహిస్తున్న మేనేజర్ పై తక్షణమే చర్యలు తీసుకొని మరో వ్యక్తిని ఈ కేంద్రంలో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాగా ప్రజల ఫిర్యాదుల మేరకు మందమర్రి తాసిల్దార్ సతీష్ కుమార్ నేరుగా మీసేవ కేంద్రానికి వెళ్లి మేనేజర్ ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరును స్వయంగా పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాగర్, దినేష్, జావిద్ ఖాన్ తదితరులు ఉన్నారు.

# బాయిజమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి భోజన్




**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని బాయిజమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు యాచకులకు, వికలాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని కీ.శే. కారుకూరి శ్రీనాథ్ మహర్షి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కాంపెల్లి శంకర్ రాజేశ్వరి వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ బస్తీకి చెందిన సదానందం మంగ దంపతుల కుమారుడు కీ"శే"కారుకూరి శ్రీనాథ్ మహర్షి జయంతి జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఆర్థిక సహకారంతో గురువారం మధ్యాహ్నం సాయిభోజన్ పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పట్టణంలోని పలుచోట్ల యాచకులకు, మానసిక వికలాంగులకు, వృద్ధులకు,అనాథలకు,రోగులకు, పేదవారికి ,అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సేవా ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్,ట్రస్ట్ సభ్యులు సేవకులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో గంజాయి పట్టివేత



**ఆదిలాబాద్ మహా :** గంజాయి ని జిల్లా పోలీస్ యంత్రాంగం ఉక్కు పాదం తో అణచివేస్తుందని ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు.జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు గంజాయి సాగు రవాణా పై కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. 160 గంజాయి మొక్కలని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్టు ఆయన తెలిపారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం అశోద గ్రామంలో భారీ ఎత్తున గంజాయి మొక్కలు పెంచుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై విష్ణువర్ధన్ ప్రత్యేక బృందంతో తనిఖీలు చేపట్టారన్నారు. నిందితుడు పంటచేలలో పత్తి , కంది పంటల మధ్యలో పెంచుతున్న గంజాయి మొక్కలను పట్టుకున్నట్లు తెలిపారు. 160 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని నిందితున్ని అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు. గంజాయి రవాణా చేసిన, సేవించిన, పండించిన, వ్యాపారం చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలతో అణచివేస్తుందని హెచ్చరించారు. పట్టుకున్నవాటి విలువ బహిరంగ మార్కెట్లో 16 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. గంజాయి కేసులో నమోదైనవారికి ప్రభుత్వ పథకాలు వర్తించకుండా జిల్లా కలెక్టర్ కి నివేదికలు పంపనున్నట్లు తెలియజేశారు. గంజాయిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సీఐ కె. ఫణి ధర్, రూరల్ ఎస్సై వి. విష్ణువర్ధన్, సిబ్బంది మంగల్ సింగ్, విటల్ , సురేష్ లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు.

# కాన్షీరాంకు బీఎస్పీ ఘన నివాళి



**మంచిర్యాల, మహా :** మాన్యశ్రీ బడుగు బలహీన వర్గాల దివంగత నేత స్వర్గీయ కాన్షీరాంకు మంచిర్యాల జిల్లా బీఎస్పి అధ్యక్షులు ముల్కల రాజేంద్రప్రసాద్ బృందం ఘన నివాళులు అర్పించారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని పురస్కరించుకొని ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎస్పి రాష్ట్ర మాజీ జోనల్ కో ఆర్డినేటర్ కత్తుల కాన్షీరామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత కాన్షీరామ్ బహుజనుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశాడని అన్నారు. ఆయన సిద్ధాంతాలు సమాజంలో సమానత్వం, న్యాయం స్థాపనకు మార్గదర్శకాలుగా నిలిచిపోయాయని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్య స్థాపన కొరకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సభను సమావేశాలు నిర్వహించి బడుగు బలహీనుకు మార్గం సుగమం చేశారని వెల్లడించారు. అంతకుముందు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, ముల్కల్ల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు నాగుల కిరణ్ బాబు, బెల్లంపల్లి నియోజకవర్గం అధ్యక్షులు దాగం శ్రీనివాస్,మంచిర్యాల జిల్లా నాయకులు బూడిద మల్లేష్, చెన్నూర్ నియోజకవర్గం నాయకులు మాతిన్ ఖాన్, మందమర్రి పట్టణ అధ్యక్షులు గాజుల శంకర్, మందమర్రి మండలం అధ్యక్షులు ఎస్.కె రహీం బాబా పాల్గొన్నారు.

# గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జనగామ కలెక్టర్



**జనగామ మహా;** ఆర్టీఐ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించినందుకు జనగామ జిల్లా కలెక్టర్ కు అరుదైన గౌరవం లభించింది. సమాచార హక్కు చట్టం వారోత్సవాలు గురువారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ డిస్ట్రిక్ట్, బెస్ట్ పిఐఓ బెస్ట్ డిపార్ట్మెంట్ ఇన్ డిస్పోజల్ ఆఫ్ ఆర్టీఐ కేసెస్ మొదలగు ఏడు విభాగాల్లో పురస్కారాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ విష్ణు దేవ్ శర్మ చేతుల మీదుగా జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అవార్డు ను అందుకున్నారు. జిల్లాలోని ఆర్టీఐ కు సంబంధించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పెండింగ్ లేకుండా వ్యవహరిస్తున్నందుకు గాను బెస్ట్ పెర్ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ గా జనగాం జిల్లా ఎంపిక అయిన సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ అవార్డు ను అందుకున్నారు. జనగాం జిల్లాకు వివిధ అంశాల్లో అనేక అవార్డు లు వస్తున్నందుకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ దిశా నిర్దేశంలో వివిధ శాఖల అధికారులుగా పని చేయడం మా అందరికీ గర్వంగా ఉందని అధికారులు హర్షం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

- బేల,ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాల వాసుల చేరిక
- కాంగ్రెస్ లో చేరిన ఖార మాజీ ఉప సర్పంచ్
- కండువాలు కప్పి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ఊపందుకుంటున్నాయి.ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో నిత్యం చేరికలు జరుగుతున్నాయి. తాజాగా గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం ఖార గ్రామ మాజీ ఉప సర్పంచ్ తో పాటు , బేల, జైనథ్ మండలాలనుండి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అంతా కలసి ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్ రావు, కొండ గంగాధర్ , సామ రూపేష్ రెడ్డి, దేవిదాస్, ఆశన్న , చంద్ర షావ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు తెలంగాణ బంద్

**బంద్‌కు పిలుపునిచ్చిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ**



**వరంగల్ హన్మకొండ మహా;** స్థానిక సంస్థల్లో బీసీలకు నలభై రెండు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ నైన్ ను నిలిపివేస్తూ గురువారం హైకోర్టు తీర్పును ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిర్ణయించింది. బంద్ ను విజయవంతం చేయాలని కోరుతూ టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లబోయిన అశోక్ ముదిరాజ్ నేతృత్వంలో గురువారం టిఆర్పి ముఖ్య నాయకులు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిఆర్పి రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజనీ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నేడు ఈ బంద్ కొనసాగుతుందని దీనిని విజయవంతం చేసేందుకు జిల్లావ్యాప్తంగా ఉన్న ముఖ్యనాయకులు టిఆర్పి కార్యకర్తలు బీసీ సంఘాల నాయకులు వివిధ కుల సంఘాల అధ్యక్షులు బీసీ ఉద్యోగులు బీసీ అడ్వకేట్లు బీసీ డాక్టర్లు, బీసీ ప్రజా సంఘాలు, మేధావులందరూ కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ బంద్ కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని బీసీలకు విద్య ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేంత వరకు ఉమ్మడిగా పోరాడుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టిఆర్పి నాయకులు పెండల సంపత్ పటేల్ జంగిలి శ్రీనివాస్ పోలు రాజు పల్లకొండ చందు మాదం నరేష్ యాదవ్ పాల్గొన్నారు.

## మండల ప్రధారీగా కనుకుంట్ల రంజిత్ నియామకం



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బిజెపి పార్టీ రాష్ట్ర ఆదేశాల మేరకు నర్సంపేట రూరల్ మండల ప్రధారీగా కనుకుంట్ల రంజిత్ కుమార్ ను నియమించడం జరిగిందని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

**వరంగల్ మహా;** నర్సంపేట నియోజకవర్గ శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి మాతృమూర్తి ఇటీవల ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు గురువారం దొంతి మాధవ రెడ్డి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి వారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# నగర సమగ్ర అభివృద్ధికి సీఎం సంపూర్ణ సహకారం

**నగర మేయర్ గుండు సుధారాణి**




**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. దేశ రాజధాని న్యూ ఢిల్లీ లో ఇక్లి సౌత్ ఏసియా, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్ ఐ యు ఏ) సంయుక్త ఆధ్వర్యం లో రెండు రోజుల పాటు (అక్టోబర్ 8,9) ఏర్పాటు చేసిన ఆరైస్ సిటీస్ కార్యక్రమంలో నగరం నుండి మేయర్ గుండు సుధారాణి ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొన్నారు. ఇక్లీ సౌత్ ఏసియా సంస్థ 20 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో శుభాకాంక్షలు తెలుపుతూ వివిధ ప్రాంతాల నుండి సుమారు 200 మంది డెలిగేట్స్ (ప్రతినిధులను) ఒక ప్లాట్ ఫాం మీదకు తీసుకు వచ్చి ఒకరి విధానాలను (వ్యూస్) మరొకరు పంచుకునేలా ఏర్పాటు చేసినందుకు ఆ సంస్థ కు అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇక్లి వారి సేవలు అనేక ప్రాంతాలకు విస్తరించాయని ఇక్లి వారి సహకారంతో వారిని సంప్రదిస్తూ క్లైమేట్ యాక్షన్ ప్లాన్, బయోడైవర్సిటీ జీరో వేస్ట్ పై ఫ్రేమ్ వర్క్ వంటి అంశాల్లో వారి సహకారాన్ని కోరుతామని తెలిపారు. ఇక్లి, ఎన్ ఐ యు ఏ కలిసి ఆరైస్ కార్యక్రమాన్ని చేపట్టడం అనేది చాలా గొప్ప విషయమని, ఈ కాన్ఫరెన్స్ యొక్క ప్రధాన మైన అవుట్ పుట్ ఢిల్లీ డిక్లరేషన్ అని త్వరలో బ్రెజిల్ దేశం లో జరిగే కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(COP)30లో ఈ అంశాలను ప్రవేశపెట్టి జిడబ్ల్యూ ఎంసీ తరపున నగరంలో అమలు జరుగుతున్న అంశాలను అభిప్రాయాలను అందజేయడం గర్వంగా ఉందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐయూఏ డైరెక్టర్ కుందు గిజ్, ఇక్లి డైరెక్టర్ ఏమన్ కుమార్, ఇక్లి సౌత్ ఏషియా హెడ్ , బెంగాల్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ సింగ్, వివిధ దేశాల, నగరాల నుండి సుమారు 200 మంది మేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఓటు చోరీ సంతకాల సేకరణలో కార్పొరేటర్




**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు దంపతుల ఆదేశాల మేరకు 22 వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ మైదాన్ కెమిస్ట్రీ భవన్ లో బీజేపీ ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా ఓటు చోరీ సంతకాల సేకరణ పెద్ద ఎత్తున చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు కు ఓటు చోరీ విషయాన్ని స్థానిక ప్రజలకు క్షుణ్ణంగా వివరించగా డివిజన్ ప్రజలు ఇలాంటివి మళ్లీ జరగకూడదని కార్పొరేటర్ కు తెలిపారు. ఇందుకు కార్యకర్తలందరు ఆధార్ కార్డు, ఓటర్ కార్డు తో కూడిన సంతకాలతో కార్యకర్తలందరూ లెటర్స్ పంపడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన



**మంఛిర్యాల, మహా :** జీఎస్టీ పై మంచిర్యాల జిల్లా వివిధ వ్యాపారులకు సిజీఎస్టి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని గురువారం వీ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ జీఎస్టీ అధికారి టి వి రమణా రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ మార్పులపై వ్యాపార వర్తకులకు ఆయన అవగాహన కల్పించారు. జీఎస్టీ రీఫార్మ్స్ 2.0" కింద ప్రభుత్వం తీసుకువచ్చిన ముఖ్యమైన మార్పులపై వివరించారు. అనంతరం వ్యాపారులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. ఈ విభాగం ఎల్లప్పుడూ వ్యాపార వర్గాల సహాయానికి, సందేహాలు నివృత్తికి సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అమన్ రాజ్, ఇన్స్పెక్టర్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ సందేశాన్ని వర్చువల్ లో వీక్షించిన జిల్లా కలెక్టర్



**వరంగల్ మహా;** సమాచార హక్కు చట్టం 2005 అమల్లోకి వచ్చి 20 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో ఈ నెల 5 నుండి 12వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమాచార హక్కు చట్టం వారోత్సవాల్లో భాగంగా గురువారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతి నుండి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొని సందేశాన్ని వర్చువల్గా అన్ని జిల్లా కలెక్టర్లలో నిర్వహించిన కార్యక్రమం లో వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు జిల్లా కలెక్టర్ జి సంధ్యారాణి , డిఆర్ఓ విజయ లక్ష్మిలతో పాటు జిల్లా అధికారులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా ఆర్టిఐ 2005 వారోత్సవాలలో జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల వారీగా పెండింగ్ లో ఉన్న ఆర్టిఐ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ కోరిన సమాచారాన్ని నిష్పక్షపాతంగా పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కార్యాలయాలలో ఆర్టిఐ సమాచారం అధికారులు పిఎఐ, పిఓ ల పేర్లు వివరాలు టెలిఫోన్ నంబర్లతో సహా పూర్తి సమాచారం ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ ఓ విశ్వ ప్రసాద్, జిల్లా అధికారులు, పి.ఐ.ఓ.లు, ఎ.పి.ఐ.ఓ.లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్ ఫర్ స్టేషన్ ను సమర్థవంతంగా నిర్వహించండి



**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

ట్రాన్స్ ఫర్ స్టేషన్ ను సమర్థవంతంగా నిర్వహించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధిలోని పోతన ట్రాన్స్ఫర్ స్టేషన్ తో పాటు నయీం నగర్ ఓల్డ్ మార్కెట్ ప్రాంతం సుబేదారి వాటర్ ట్యాంక్ పబ్లిక్ గార్డెన్ ఏనుగుల గడ్డ ప్రాంతం లో కమిషనర్ క్షేత్ర స్థాయి లో సందర్శించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ పోతన నగర్ లో గల ట్రాన్స్ఫర్ స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేసి ఆపరేషన్& మెయింటెనెన్స్ కు సంబంధించి అన్ని రకాల నిబంధనలు పాటిస్తున్నారా లేదా ఒక స్వచ్ఛ ఆటో చెత్త క్యాంఫాక్టర్ లోకి చేరడానికి ఎంత సమయం తీసుకుంటుందని సమయాన్ని ఆదా చేయాలని డ్రైవర్లకు సూచించారు. ఏజెన్సీ నిర్వాహకులు ఇంజనీర్ల ద్వారా అగ్రిమెంట్ లో సూచించిన విధం గా లేబర్ యాక్ట్ ప్రకారం సిబ్బందికి సేఫ్ గాడ్స్ తో పాటు పి పి ఈ కిట్లు ఉండాలని ప్రతిరోజు సాయంత్రం లోగా ట్రాన్స్ఫర్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. హనుమకొండలోని నయీమ్ నగర్ ప్రాంతంలో ఓల్డ్ వెజిటబుల్ మార్కెట్ యందు బయో కంపోస్ట్ యూనిట్ ను సందర్శించారు. వీధి వ్యాపారులు అట్టి మార్కెట్ ను ఆక్రమించుకున్నారని అప్రాంతాన్ని బయో కంపోస్ట్ ఎరువు తయారు చేయడానికి అనువుగా ఉందని అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఈ ఈ నీ ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఇష్టా రీతిగా పార్కింగ్ చేస్తున్నారని నియంత్రించాలని సిటీ ప్లానర్ ను ఆదేశించారు. హన్మకొండ ఏనుగుల గడ్డ ప్రాంతంలో పర్యటించి పార్కింగ్ చేసి ఉన్న బస్సు యజమానులతో మాట్లాడిన కమిషనర్ ఈ ప్రాంతం వాహనాలు నిలపడానికి కాదని వెంటనే ఈ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎస్ ఈ సత్యనారాయణ, ఏం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఈ ఈ లు రవికుమార్, మహేందర్ మాధవి లత, డి ఈ సారంగం, ఏ ఈ హరి కుమార్, తదితరులు, పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ సీటు సాధించడం గొప్ప విషయం

**పోలీసుల పిల్లలను అభినందించిన సీపీ**



**హన్మకొండ మహా;** ఎంతో కష్టపడి ఎంబిబిఎస్ లో సీటు సాధించిన పోలీస్ కుటుంబాలకు చెందిన పిల్లలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఘనంగా సత్కరించి అభినందించారు. కొద్ది రోజుల క్రితం ఎంబిబీఎస్ మొదట విడత కౌన్సిలింగ్ లో సెంట్రల్ జోన్ షేక్ సలీమా కుమార్తె తాన్య సభ హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా, హోంగార్డ్ బాలకిషన్ కుమారుడు ముప్పా చందుకు మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు, మరో హోం గార్డ్ మోహన్ కుమార్తె భవాని ఆసిఫాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలో సీటు సాధించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్ళు ఉన్న పిల్లలు చదువుల పట్ల అశ్రద్ధ వహించవద్దని, వారిని ఉన్నత చదువులు చదివే విధంగా ప్రోత్సాహించాలని, తమ పిల్లలు ఎంబిబిఎస్ సీటు సాధించడానికి కృషి చేసిన తల్లిదండ్రులకు పోలీస్ కమిషనర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అడిషనల్ డీసీపీ లు శ్రీనివాస్, ప్రభాకర్ రావు, ఏసీపీ నాగయ్య, ఆర్. ఐ చంద్రశేఖర్ తో హోం గార్డ్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మాజీ కార్పొరేటర్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ సోదరి గురువారం గుండెపోటుతో మరణించగా విషయం తెలుసుకున్న గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వారి నివాసానికి వెళ్లి ఆమె పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంటా 18వ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు మహిళ నాయకురాలు, యువజన నాయకులు తదితరులు ఉన్నారు.

# బి.ఆర్.ఎస్ పార్టీ చలో బస్సు భవన్ సందర్భంగా గండిపేట మండల ముఖ్య నాయకులు హౌస్ అరెస్ట్



**గండిపేట,మహా:** తెలంగాణలో ఆర్టీసీ బస్ చార్జీలు పెంపుకు నిరసనగా గురువారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చలో బస్ భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా, గండిపేట మండలం నుండి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు స్వామి గౌడ్, మరియు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు మరియు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బస్సు భవన్ కు తరలి వెళ్తున్న సందర్భంగా పోలీసులు వారిని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఒంటెద్దు పోగడ తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఉచిత పథకాల ముసుగులో పేద ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, పథకాల అమలు ను మరిచి పేదవాడి నడ్డి విరవటానికి సిద్ధమైందన్నారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం అని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు బస్సు టికెట్టు చార్జీలను పెంచడం ద్వారా బస్సులో ప్రయాణించే మధ్య తరగతి పురుషులు మరియు విద్యార్థుల నెత్తిన అధిక ఆర్థిక భారాన్ని వేయడం ఎంతవరకు సమంజస మన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కెసిఆర్ ఆధ్వర్యంలో తెలంగాణను తిరిగి అభివృద్ధి పథంలో తీసుకుపోవడం ఖాయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### గండిపేట మండలంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో భాగంగా

# ఉత్తమ క్రీడాకారుల ఎంపిక పోటీలు



**గండిపేట,మహా:** 69 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలలో భాగంగా గండిపేట మండలం నుండి ఉత్తమ క్రీడాకారుల ఎంపిక గురువారం మండలంలోని డాన్ బాస్కో పాఠశాలలో మండల స్థాయి క్రీడ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గండిపేట మండల విద్యాశాఖ అధికారి సునీల్ కుమార్, మండల ఇంచార్జ్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్. జ్యోష్ణ లు క్రీడాకారులకు పలు సూచనలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పోటీలలో సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొనగా కబడ్డీ కోకో మరియు వాలీబాల్ క్రీడలలో క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ మండల స్థాయి పోటీలలో ఎంపికైన క్రీడాకారులు త్వరలోనే జరగబోయే జోనల్ స్థాయి పోటీలలో గండిపేట మండలం నుంచి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఛార్జీలను తగ్గించి సామాన్యుడిపై భారం తగ్గించాలి



**ఆమనగల్లు,మహా:** టికెట్ ధరల పెంపుకు వ్యతిరేకంగా ఆర్టీసీ బస్సెక్కి గురువారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ బస్టాండ్ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్క యలు దేరుతున్న ఆర్టీసీ బస్సులోకి ఎక్కి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు.సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని నిరసన తెలుపుతున్న నాయకులను పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షులు పత్య నాయక్, మాట్లాడుతూమహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం ఇచ్చినట్లే ఇచ్చి, పురుషుల నుంచి డబుల్ ఛార్జీ వాసులు చేస్తున్నారు అని ఆరోపించారు. మహిళలకు ఉచితమని చెప్పి పురుషులకు టికెట్ ధరలు పెంచారని విమర్శించారు విద్యార్థుల బస్సు పాస్ ధరలు పెంచారని మండిపడ్డారు. ఇలా ధరలు పెంచితే సామాన్య కుటుంబం మీద భారం పడదా? అని ప్రశ్నించారు. మధ్యతరగతి కుటుంబాలకు ధరలు పెంచి పీక్కు తింటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే పెంచిన బస్ ఛార్జీలనును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన తెలియజేసిన వారిలో నాయకులు సయ్యద్ ఖలీల్, నిరంజన్,శ్రీను నాయక్, పంతు నాయక్, వెంకటేష్, యాదయ్య, జగన్, భాస్కర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మున్సిపల్ మహాసభను విజయవంతం చేయాలి



**సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అల్లీ దేవేందర్**

**మొయినాబాద్ మహా:** మున్సిపల్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ పేర్కొన్నారు. గురువారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మొయినాబాద్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లి దేవేందర్ హాజరై మాట్లాడుతూ ఈనెల 14,15 తేదీలలో రంగారెడ్డి జిల్లాలోని తుర్కయంజాల్ లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఐదవ రాష్ట్ర మహాసభ జరుగుతుందని ఈ మహాసభలను కార్మికులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ యూనియన్ రాష్ట్ర మహాసభలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రెండు రోజులు చర్చించి కార్మికుల సమస్యలపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు రత్నం, అధ్యక్షులు సుధాకర్ ప్రధాన కార్యదర్శి సురేష్ ఉపాధ్యక్షులు ప్రవీణ్, నరసింహ, అంజయ్య రామచందర్ శివ లక్ష్మమ్మ సాలమ్మ లతా తదితరులు పాల్గొన్నారు

# రాజకీయ కుట్రలతో హైకోర్టు స్టే..

**బీసీల నోటికాడి బువ్వ అందకుండా పోయింది..**

**రంగారెడ్డి జిల్లా మహా:** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం దురదృష్టకరం అని, బీసీలు ఎవరూ అధైర్యపడొద్దు అని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. గురువారం వచ్చిన హైకోర్టు తీర్పుతో నిరాశ చదవడం జరిగిందని, బీసీ రిజర్వేషన్ల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం జరిగిందని, కేంద్రం సహకరించకపోయినా, గవర్నర్ పట్టించుకోకపోయినా, ప్రతిపక్షాలు కలిసి రాకపోయినా, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల కోసం సీఎం ఒంటరి పోరాటం చేసిందని, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. బీసీల లెక్క తేల్చి రిజర్వేషన్ కల్పించాం... బీసీ రిజర్వేషన్ల కోసం సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, కులగణన చేయడంతో పాటు డెడికేటెడ్ కమిషన్ వేసి బీసీల లెక్క తేల్చి రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. కొందరి కుట్రల వల్ల బీసీల నోటికాడి బువ్వ అందకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీసీల కోసం న్యాయపోరాటాన్ని కొనసాగిస్తాం...**

అయినా మేం నిరాశ చెందం.. మా పోరాటం కొనసాగుతుందని, ప్రజల పక్షాన నిలబడతామని స్పష్టం చేశారు. మా ప్రభుత్వం న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తుందని ప్రయత్నాన్ని ఎక్కడ కూడా ఆపే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే తేల్చి చెప్పారు. తప్పకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించి పెడతాం. ఇచ్చిన రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు.

**కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించి ఉంటే...**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని బీసీలకు అందాల్సిన రిజర్వేషన్లను అందకుండా కొందరు కుట్ర దారులు రాజకీయాల్లో ఎదుర్కోలేక ఇలాంటి నీచమైన పనులకు దిగజారుతున్నారని మండిపడ్డారు.. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఇప్పటికైనా బీసీల ఆవేదనను అర్థం చేసుకొని కలిసి రావాలని ఆయన కోరారు..

**బీసీలు ఎవరూ అధైర్యపడొద్దు..**

బీసీలు ఎవరూ అధైర్యపడొద్దు అని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తప్పనిసరిగా రిజర్వేషన్లు సాధించుకుని తీరుతామని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు.

# ఫినాయిల్ తాగిన ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యార్థి

- షాద్ నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స
- బాధితుడు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్
- పూర్తి వివరాలు చెప్పడానికి నిరాకరించిన విద్యార్థి తండ్రి, గురుకుల పాఠశాల అధ్యాపకులు



**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల పదవ తరగతి విద్యార్థి హర్షవర్ధన్ ఫినాయిల్ తాగాడు. దీంతో అనారోగ్యానికి గురైన హర్షవర్ధన్ ను వెంటనే మెరుగైన చికిత్స కోసం షాద్ నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. గురుకుల పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే ఫినాయిల్ విద్యార్థి హర్షవర్ధన్ ఎందుకు తాగాడు అన్న విషయం ఇంకా తెలిసి రాలేదు. ప్రభుత్వాసుపత్రి వద్ద చికిత్స పొందుతున్న విద్యార్థి తండ్రి రమేష్ ను మీడియా అడుగగా వివరాలు చెప్పడానికి నిరాకరించాడు. అదేవిధంగా అక్కడే ఉన్న గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు సైతం తమకు తెలవదు అన్నట్టు మీడియాతో మాట్లాడారు. ఏం జరిగిందని అడగగా తన తెలియదని సమాధానం చెప్పడంతో మరి ఇక్కడ ఎందుకు ఉన్నారని ప్రశ్నించగా అక్కడి నుండి వెళ్లిపోయాడు. కేశంపేట గురుకుల పాఠశాలకు సంబంధించి పట్టణంలోని చటాన్ పల్లి వద్ద ఈవిద్య సంస్థను నిర్వహిస్తున్నారు. బాలుడు ఫినాయిల్ ఎందుకు తాగాల్సి వచ్చింది? ఎవరైనా బలవంతంగా తాపారా లేక అక్కడ ఉంటే పొరబడి తాగాడా అన్న విషయాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. ఉన్నతాధికారులు రంగంలోకి దిగితే తప్ప ఈ విషయం తెలియదు. ఈ మధ్యకాలంలో ప్రజెంట్ పాఠశాలల నిర్వహణపై అనేక ఆరోపణలు వస్తున్న విషయం విధితమే. ఓ గిరిజన విద్యార్థిని ఇటీవల టార్గెట్ చేసి రెసిడెన్షియల్ పాఠశాల నుండి తరిమివేసిన సంఘటన మరువకముందే మరో సంఘటన వెలుగు చూస్తోంది.

## పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలి: జిల్లా కలెక్టర్

**యాదగిరిగుట్ట, మహా:** ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన చికిత్స అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో పల్లె దవాఖాన ని ఆకస్మిక ఆయన తనిఖీ చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ దవాఖానలో ఏపీ ఓపి రిజిస్టర్ లను తనిఖీ చేశారు, రోజు ఎంత మంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.మందులు అన్ని అందుబాటులో ఉన్నాయా అని, అన్ని రకాల మందులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. గత నెలలో ఈ పల్లె దవాఖాన పరిధిలో ఎన్ని డెలివరీ లు అయ్యాయి, అవి ఏ ఆసుపత్రులలో అయ్యాయో అని ఆరా తీశారు, ఈ నెలలో ఎన్ని ఈ డి డి లు ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పల్లె దవాఖాన లో పరిశుభ్రంగా ఉంచుకోవడం , వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించడం చేస్తున్న ఎం ఎల్ ఎచ్ పి డాక్టర్ ఆర్ మూల్యంక, ఆస్పత్రిలో లో సక్రమంగా విధులు నిర్వహిస్తున్న ఏ ఎన్ మ్ లు , ఆశ కార్యకర్త ని కలెక్టర్ అభినందించి శాలువా తో సత్కరించారు.

# ఊహించినదే జరిగింది

**నకిలీ జీఓతో సర్కార్ ఫెయిల్యూర్**

**బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి ఆగ్రహం**



**షాద్ నగర్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించుటలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని హైకోర్టు స్టే విధించడం ద్వారా మరోసారి నిరూపితం అయిందని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు కొందుర్గు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదరాబాదరాగా చెల్లని జీవో తెచ్చి తామేదో బీసీ సామాజికవర్గాన్ని ఉద్ధరిస్తున్నట్టు షో చేసి చట్టం ముందు బోర్లా పడిందని అన్నారు. తెలంగాణ సమాజం ఎలక్షన్లు జరగవని ముందే ఊహించిందని, ప్రజల మనోభావాలను దెబ్బతీస్తూ నకిలీ జీవో ద్వారా ఎలక్షన్ నిర్వహిస్తామని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం ఇప్పటికే రెండు సంవత్సరాల కాలనీ వృధా చేసిందని, తక్షణమే బీసీ సమాజానికి క్షమాపణలు చెప్పాలని అన్నారు. డ్రామాలు ఆపి ఎలా ముందుకు వెళితే ఎలక్షన్లు జరుగుతాయనేది ఆలోచన చేయాలని, రిజర్వేషన్ల పేరుతో బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజా కోర్టులో శిక్ష తప్పదని స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు బోయ శంకర్, బీజేవైఎం నాయకులు బోయ అశోక్, నాయకులు యాదయ్య, శేఖర్, మహేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడింది

**మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్**



**షాద్ నగర్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి బాకీ పడిందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా షాద్ నగర్ మున్సిపాలిటీ ఫరూఖ్ నగర్ లో స్వయంగా ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అనే విషయాలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్న అనంతరం మాట్లాడారు. వంద రోజుల్లో గ్యారంటీలను అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను మర్చిపోయిందని విమర్శించారు. ఉచిత బస్సు మినహా ఏ పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక పోయారని, పేద ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. సాధారణ కుటుంబానికి సైతం కాంగ్రెస్ ప్రభుత్వం వేల రూపాయలు బాకీ పడిందని, కాంగ్రెస్ చేతిలో మోసపోయామని పేద ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ఇందులో భాగంగానే 4000 పింఛన్లు, రాయితీ సిలిండర్లు, గృహ జ్యోతి విద్యుత్తు, రైతు కూలీలకు 12,000, మహిళలకు 2500, విద్యార్థులు విద్యార్థినీలకు స్కూటీలు, రైతు భరోసా నిధులు, రైతు రుణమాఫీ, బతుకమ్మ చీరల పంపిణీ వంటి ఎన్నో పథకాలు అమలు చేయడం లేదని ప్రజలు బహిరంగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం పై దుమ్మెత్తి పోస్తున్నారని చెప్పారు. అంజయ్య యాదవ్ ముందే పలువురు మహిళలు, వృద్ధులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ తిట్ల దండకాన్ని వల్లించారు. మోసపోయి ఓటు వేశామని, మరోసారి ఓట్ల కోసం వస్తే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని బహిరంగంగానే మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెబితే ఉన్న ఇల్లును కులాకొట్టుకున్నామని, ఇప్పుడు ఎవరు పట్టించుకోవడంలేదని ఓ మహిళా వాపోయింది. గృహ జ్యోతి ద్వారా జీరో బిల్లు రావడం లేదని, మా కుటుంబం అత్యంత పేదరికంలో ఉందని ఓ వృద్ధురాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. పండుగ పూట ఒక్క బతుకమ్మ చీర కూడా ఇవ్వలేదని, కేసీఆర్ ఉన్నప్పుడు నాలుగైదు రోజుల ముందే ఇంటింటికి చీరలు ఇచ్చిండని గుర్తు చేశారు. మా కూతురు పెళ్లి అయి ఆరు నెలలు గడిచిన ఇప్పటికీ తులం బంగారం ఊసే లేదని, మాకు బంగారం ఇస్తాడని నమ్మకమే లేదని ఓ మహిళ వాపోయింది. ఇలా అడుగడుగునా ప్రజలందరూ కాంగ్రెస్ ప్రభుత్వం పై దుమ్మెత్తి పోశారు. ప్రజల ఆవేదనను గ్రహించిన అంజయ్య యాదవ్ ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# బీసీ రిజర్వేషన్లకు బీజేపీ బీఆర్ఎస్ అడ్డంకులు

**టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్**

**మొయినాబాద్ మహా:** బీసీల 42 శాతం రిజర్వేషన్ ల ద్రోహి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలేనని టిపిసిసి కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్ పేర్కొన్నారు. గురువారం ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. దేశంలో రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్రలో భాగంగా బీసీలకు అన్యాయం జరుగుతుందని గమనించిన ఆయన దేశవ్యాప్తంగా బిసి గణన నిర్వహించాలని పేర్కొనడం జరిగిందని అన్నారు. అదేవిధంగా పార్లమెంట్ లో చర్చించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ లు ఎంతో అద్భుతంగా నిర్వహించారని పేర్కొన్నారు. అసెంబ్లీలో 42% బీసీల రిజర్వేషన్ లను అన్ని పార్టీలతో ఏక తీర్మానం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేనని తెలిపారు. క్యాబినెట్ లో ఆమోదించడం జరిగిందని అన్నారు. ఆ తర్వాత రాష్ట్ర గవర్నర్ కు అన్ని పార్టీలు తీర్మానించిన ఆమోదించి తీర్మానం చేసిన వాటిని గవర్నర్ కు సమర్పించారని తెలిపారు. అన్ని పార్టీలు అసెంబ్లీలో చర్చించి తీర్మానించినప్పటికీని కులగణనకు సమర్పించిన పత్రాలపై గవర్నర్ దానిపై సంతకం చేయకుండా బీజేపీ పార్టీ కన్నుసనులో పనిచేస్తున్నారని ఆరోపించారు. బిల్లుపై సంతకం చేస్తే ఈనాడు ఎన్నికలు ఎంతో సజావుగా జరిగేవని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు ఎంతో ఆదర్శంగా నిలుస్తూ.. బీసీ గణనను చేపట్టి నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. బీసీ కులగణనను అడ్డుకోవడం బీఆర్ఎస్ బీజేపీ పార్టీలకు ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ పార్టీలకు బీసీ ప్రజల నుంచి అమూల్యం తప్పదని తెలిపారు. సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బడ జంగయ్య డైరెక్టర్ బాబన్న మాజీ సర్పంచులు చేగురి రామకృష్ణ గౌడ్ దూది ప్రవీణ్ మాజీ ఎంపీటీసీ పట్నం రామ్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్ ముదిరాజ్ మొయినాబాద్ మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు బొక్క వెంకటరెడ్డి మైనాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాదాపురం విజయ్ రాజ్ పి ఆఫీసర్ మాజీ ఉపసర్పంచ్ కరుణాకర్ ముదిరాజ్ ఫిరంగి భాస్కర్ ఇమ్మిటి రవీందర్ రెడ్డి, కొత్తపల్లి కృష్ణారెడ్డి చాకలి శ్రీశైలం అమిత్ ఖాన్ తెలుగు వెంకటయ్య ముదిరాజ్ కామిన జంగయ్య బోలించరు రవీందర్ రెడ్డి ఎండి జహీర్ మోత్కుపల్లి బాలయ్య శివ సాయి యాదవ్ పాల్గొన్నారు.



# బీసీలకు రేవంత్ రెడ్డి ఘరానా మోసం

**వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్**

**రంగారెడ్డి జిల్లా మహా:** ఒకసారి కేంద్రం 9వ షెడ్యూల్ లో చేర్చాలంటూ హడావుడి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, మరోసారి పార్టీపరమైన రిజర్వేషన్లు కల్పిస్తామని, ఆర్డినెన్స్ ద్వారా అమలు చేస్తున్నామని ఇలా పూటకో మాటతో ఇన్నాళ్లు కాలయాపన చేశారని మోత్కు ఆనంద్ అన్నారు.. బీసీ రిజర్వేషన్ బిల్లు చివరకు చెల్లదని తెలిసినా, ప్రజలను మోసం చేసేందుకు ప్రత్యేక జీవో తెచ్చిన రేవంత్ రెడ్డి సర్కార్... ఆపై తన అనుచరులతో కోర్టులో కేసు వేయించారని మోత్కు ఆనంద్ ఆరోపణ చేశారు. కోర్టులో స్టే వచ్చేలా రహస్య మంతనాలు చేసి, డ్రామాల మీద డ్రామాలు ఆడి, ఎట్టకేలకు తాను అనుకున్నట్టుగానే బీసీలను మోసం చేశారని ఆయన అన్నారు. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఉద్దేశం రేవంత్ రెడ్డికి లేదు, అందుకే ఇన్ని డ్రామాలకు పూనుకుని ప్రజల, నాయకుల విలువైన సమయాన్ని వృధా చేశారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కపట నాటకాలతో ఇన్నాళ్లు బీసీలను మోసం చేసినందుకు వారి ఆగ్రహనికి గురికాక తప్పదు అని, బిఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ కాంగ్రెస్ పార్టీపై తీవ్రంగా మండిపడ్డారు.



**రంగారెడ్డి జిల్లా ఎస్సీ వర్కింగ్ చైర్మన్ గా బండ్లగూడ జాగిర్ మాజీ సర్పంచ్**

# గంగనీ హరికృష్ణ నియామకం

**గండిపేట, మహా:** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ వర్కింగ్ చైర్మన్ గా బండ్లగూడ జాగిర్ మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ నియామకమయ్యారు. గురువారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం మరియు ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ లో అర్హులైన వారందరికీ సహాయపడతానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ జలపల్లి నరేందర్, తదితరులు పాల్గొన్నారు

# విపక్షాలు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం



**టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**

**ఆమనగల్లు, మహా:** రాష్ట్రంలో బీసీల కు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే విపక్షాలు అడ్డుకుంటున్నాయని టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం కడ్తాల మండలం మైసిగండి లో డీసీసీ ఉపాధ్యక్షులు నేనావత్ భీక్య నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా ముదిరాజ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సభవత్ బిచ్య నాయక్ లతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 % రిజర్వేషన్ ఇవ్వాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపితే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పార్లమెంట్లో చర్చించకుండా బిల్లు పాస్ చేయకుండా 9 షెడ్యూల్ లో చేర్చకుండా తాత్సారం చేస్తుందన్నారు. రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన బిల్లు రాష్ట్రపతి దగ్గర గవర్నర్ దగ్గర బిల్లులు పెండింగ్లో పెట్టడానికి బిజెపి నాయకులే కారణమని శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికల్లో బీసీలకు న్యాయం చేస్తే అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం దానిని 23 శాతానికి తగ్గించి 11% రిజర్వేషన్ కోత విధించి బీసీలకు అన్యాయం చేసిందన్నారు. కొందరు బీసీ వ్యతిరేకులు నోటి కాడి ముద్దను లాక్కునే విధంగా కోర్టుకు వెళ్లి బీసీలకు వ్యతిరేకంగా బీసీ రిజర్వేషన్ వ్యతిరేకంగా పిటిషన్లు వేస్తే కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం దానికి కౌంటర్ వేసి బీసీ లకు న్యాయం చేసి ఎలక్షన్ జరుపలని ప్రయత్నం చేస్తు బిజెపి, టిఆర్ఎస్ లను కూడా హైకోర్టులో తమ పార్టీల పక్షాన ఆఫీడవిట్ వేయాలని విపక్ష పార్టీలను ప్రభుత్వం వేడుకున్న ఆఫీడవిట్ వేయకపోగా కాంగ్రెస్ పార్టీని నిందించడం ప్రజలను పక్కదోవ పట్టించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీ, బిజెపి పార్టీ హైకోర్టు కోరిన విధంగా రెండు వారాల్లోగా పార్టీల వాదనలు ఆఫీడవిట్ లు, రిప్లై లు, ఇవ్వాలని ప్రజా ప్రభుత్వంతో కలిసి హైకోర్టులో బీసీలకు అనుకూలంగా మద్దతుగా నిలిచి బీసీల పట్ల మీ వైఖరి చాటుకోవాలన్నారు. లేనియెడల బీసీల ద్రోహుల పార్టీగా బిజెపి బిఆర్ఎస్ మిగిలిపోతాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.కార్యక్రమంలో చేకూరి వెంకటేష్,గురిగళ్ళ లక్ష్మయ్య,మాజీ సర్పంచ్ శంకర్, రామకృష్ణ, హిరాసింగ్ నాయక్, రామచంద్రనాయక్, స్టాలిన్ కిషన్ పంత్య నాయక్, జగన్ గౌడ్,బిక్షపతి, శబ్బు, తులసిరామ్ నాయక్, బోణి శంకర్, చాత్రు, సుధీర్, సాయి కుమార్, ఆంజనేయులు గౌడ్, శివ, మురళి, సృజన్ తదితరులు పాల్గొన్నారు

## ఫోర్బ్స్ ఇండియా బిలియనీర్స్ జాబితా..
# టాప్ 10లో ఒక్క మహిళ



భారతదేశంలోని అత్యంత ధనవంతులైన 100 మంది వ్యక్తుల జాబితాను.. ఫోర్బ్స్ ఇండియా రిలీజ్ చేసింది. ఈ విషయాన్ని తన ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ 'ముకేశ్ అంబానీ' అగ్రస్థానంలో నిలిచారు. 105 బిలియన్ డాలర్ల నికర విలువతో ముకేశ్ అంబానీ.. ప్రథమ స్థానంలో నిలిచారు. గత ఏడాదితో పోలిస్తే ఈయన సంపద 12 శాతం క్షీణించింది. 2వ స్థానంలో మౌలిక సదుపాయాల దిగ్గజం గౌతమ్ అదానీ & కుటుంబం 92 బిలియన్ డాలర్ల సంపదతో ఉన్నారు. మొత్తం మీద వందమంది ధనవంతుల సంపద 2025లో 9 శాతం తగ్గింది. ఓపీ జిందాల్ గ్రూప్‌కు చెందిన సావిత్రి జిందాల్ మూడో స్థానంలో నిలిచారు. వీరి నికర విలువ 3.5 బిలియన్లు తగ్గి.. 40.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. టాప్ 10 జాబితాలో ఉన్న మహిళగా ఈమె రికార్డ్ క్రియేట్ చేశారు. టెలికాం దిగ్గజం సునీల్ మిట్టల్, టెక్ బిలియనీర్ శివ నాడార్ వరుసగా నాలుగు, ఐదోస్థానంలో నిలిచారు.

**భారతదేశంలోని టాప్ 10 బిలియనీయర్స్**

- **ముకేశ్ అంబానీ: 105 బిలియన్ డాలర్లు**
- **గౌతమ్ అదానీ & కుటుంబం: 92 బిలియన్ డాలర్లు**
- **సావిత్రి జిందాల్: 40.2 బిలియన్ డాలర్లు**
- **సునీల్ మిట్టల్ & కుటుంబం: 34.2 బిలియన్ డాలర్లు**
- **శివ్ నాడర్: 33.2 బిలియన్ డాలర్లు**
- **రాధాకిషన్ దమానీ & కుటుంబం: 28.2 బిలియన్ డాలర్లు**
- **దిలీప్ షాంఘ్వీ: 26.3 బిలియన్ డాలర్లు**
- **బజాజ్ కుటుంబం: 21.8 బిలియన్ డాలర్లు**
- **సైరస్ పూనవల్లా: 21.4 బిలియన్ డాలర్లు**
- **కుమార్ మంగళం బిర్లా: 20.7 బిలియన్ డాలర్లు**




## కొత్త ఫోన్ తీసుకొచ్చిన జియో..
# ఇది ఉంటే ఫుల్ సేఫ్టీ!

రిలయన్స్ జియో సరికొత్త ఫోన్‌ను తీసుకొచ్చింది. ఢిల్లీలో జరుగుతున్న ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ 2025 సదస్సులో వివిధ సేఫ్టీ ఫీచర్లతో కూడిన జియోభారత్ ఫోన్లను ప్రవేశపెట్టింది. ఫోన్ పర్యవేక్షణ, వినియోగ నిర్వహణ, కుటుంబ సభ్యులు, పిల్లలు, వృద్ధులకు సంబంధించిన హెల్త్ వంటి సేఫ్టీఫస్ట్ ఫీచర్లను ఈ ఫోన్‌లో తీసుకొచ్చింది. వినియోగదారులకు భద్రతతోపాటు పీస్ ఆఫ్ మైండ్ ఇచ్చేలా రూపొందించిన జియోభారత్ ఫోన్లను ఐఎంసీ సదస్సులో రిలయన్స్ ఆవిష్కరించింది. అంతేకాకుండా వైట్‌లిస్టింగ్ ద్వారా అవాంఛిత కాల్స్ , కాలర్లను నివారించడంలో సేఫ్టీ షీల్డ్ సహాయపడుతుంది. ఇక అత్యంత ముఖ్యమైన ఫీచర్ ఏంటంటే కుటుంబ సభ్యుల వద్ద ఉన్న జియోఫోన్‌లో బ్యాటరీ , నెట్ వర్క్ లభ్యత స్థితిని రిమోట్‌గా పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. ఇక ఫోన్ బ్యాటరీ బ్యాకప్ ఏడు రోజుల వరకు ఉంటుందని జియో పేర్కొంది. జియోభారత్ ఫోన్ సేఫ్టీ షీల్డ్ మరిన్ని ప్రయోజనాలను రిలయన్స్ జియో అధ్యక్షుడు సునీల్ దత్ వివరించారు. ఈ ఫోన్‌లు ముఖ్యంగా కుటుంబంలోని పిల్లలు, పెద్దవారి కోసం రూపొందించినట్లు చెప్పారు. ఈ ఫోన్‌లు వినియోగిస్తున్న తమ వారు ఎక్కడ ఉన్నారు.. వారి ఫోన్‌లు ఎక్కడ ఉన్నాయో మీరు పర్యవేక్షించగలుగుతారు. ఒకవేళ కనిపించక పోయినట్లయితే ఫోన్‌లోని అలారాన్ని మోగించవచ్చు. జియోభారత్ ఫోన్‌లను జియో స్టోర్స్, జియోమార్ట్, అమెజాన్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కొనుగోలుచ చేయవచ్చు. జియోభారత్ ఫోన్ల ధర రూ.799 నుంచి ప్రారంభమవుతుంది.

# లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

గురువారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 398.45 పాయింట్లు లేదా 0.49 శాతం లాభంతో 82,172.10 వద్ద, నిఫ్టీ 135.65 పాయింట్లు లేదా 0.54 శాతం లాభంతో 25,181.80 వద్ద నిలిచాయి. జిందాల్ ఫోటో లిమిటెడ్, నాగరీకా క్యాపిటల్ మరియు ఇన్ఫ్రాస్ట్రక్చర్, జీఎం బ్రూవరీస్, ఆల్కలీ మెటల్స్, వీ విన్ లిమిటెడ్ వంటివి లాభాల జాబితాలో చేరాయి. నీరాజ్ సిమెంట్ స్ట్రక్చరల్స్, ఐమ్కో ఎలెకాన్ (ఇండియా), మోడీ రబ్బర్ లిమిటెడ్, సుమీత్ ఇండస్ట్రీస్, హెడ్స్ అప్ వెంచర్స్ వంటి కంపెనీలు వంటివి నష్టాల జాబితాలో చేరాయి.

# జపాన్ మొబిలిటీ షో 2025




మారుతి సుజుకి త్వరలో జరగనున్న జపాన్ మొబిలిటీ షో 2025లో ప్రదర్శించబోయే.. మారుతి సుజుకి ఫ్రాంక్స్ ఫ్లెక్స్‌ఫ్యూయల్ కాన్సెప్ట్ గురించి వెల్లడించింది. ఇది 85 శాతం వరకు ఇథనాల్ బ్లెండింగ్‌కు మద్దతు ఇచ్చే ప్రస్తుత 1.2లీటర్ పెట్రోల్ ఇంజిన్ ట్వీక్డ్ వెర్షన్ ద్వారా శక్తిని పొందుతుందని సమాచారం. అయితే కంపెనీ ఫ్లెక్స్‌ఫ్యూయల్ పవర్‌ట్రెయిన్ వివరాలను పూర్తిగా వెల్లడించలేదు. జపాన్ మొబిలిటీ షోలో కనిపించనున్న ఫ్రాంక్స్ ఫ్లెక్స్‌ఫ్యూయల్ కారు డిజైన్ ముందు భాగంలో సుజుకి ఎటువంటి మార్పులకు లోను కాలేదు. అయితే సైడ్ ప్రొఫైల్ కొన్ని 'ఫ్లెక్స్‌ఫ్యూయల్' డెకల్‌లను పొందుతుంది. టెయిల్‌గేట్‌పై ఫ్లెక్స్‌ఫ్యూయల్ బ్యాడ్జ్ ఉన్నట్లు తెలుస్తుంది.

**జపాన్ మొబిలిటీ షో 2025లో సుజుకి**

జపాన్ మొబిలిటీ షో అనేది రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఆటో షో. ఈ కార్యక్రమం 2025 అక్టోబర్ 30 నుంచి నవంబర్ 9 వరకు ఒడైబాలోని టోక్యో బిగ్ సైట్‌లో జరుగుతుంది. ఇందులో సుజుకి రాబోయే ఈవిటారా , ఫేస్‌లిఫ్టెడ్ ఎక్స్‌బీ, జిమ్నీ నోమేడ్ (5సీట్ల మేడ్‌ఇన్‌ఇండియా జిమ్నీ), స్పేసియా, విజన్ ఈస్కై బీఈవీ కాన్సెప్ట్ & ఈఎవ్రీ కమర్షియల్ వ్యాన్ కాన్సెప్ట్‌లను కూడా ప్రదర్శించనుంది. ఈవేదికపైనే ఫ్రాంక్స్ ఫ్లెక్స్‌ఫ్యూయల్ కాన్సెప్ట్‌ను కూడా ప్రదర్శించనుంది.

# ఐదేళ్లలో అత్యధికం.. లాభాల్లో హోండా మోటార్‌సైకిల్

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా నికర లాభం గతేడాది (2024-25) 38 శాతం జంప్‌చేసి రూ. 3,727 కోట్లకు చేరింది. ఇది గత ఐదేళ్లలోనే అత్యధికం కాగా.. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వివరాల ప్రకారం అంతక్రితం ఏడాది (2023-24)లో రూ. 2,705 కోట్లు మాత్రమే ఆర్జించింది. నిర్వహణ ఆదాయం సైతం 23 శాతం ఎగసి రూ. 39,238 కోట్లను తాకింది. అంతక్రితం రూ. 31,945 కోట్ల టర్నోవర్ సాధించింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. జపనీస్ ఆటో రంగ దిగ్గజం హోండా మోటార్‌కు చెందిన దేశీ అనుబంధ అన్‌లిస్టెడ్ సంస్థ ఇది. ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ ఫెడరేషన్ (ఎఫ్ఏడీఏ) వివరాల ప్రకారం.. గతేడాది రిటైల్‌గా 1,88,77,812 ద్విచక్ర వాహనాలు విక్రయమయ్యాయి. వీటిలో హోండా మోటార్‌సైకిల్ రిటైల్ అమ్మకాలు 47,89,283 యూనిట్లుగా నమోదయ్యాయి. వెరసి హీరో మోటోకార్ప్(54,45,251 యూనిట్లు) తదుపరి ద్వితీయ ర్యాంకులో నిలిచింది. కాగా.. 2030కల్లా దేశీ ద్విచక్ర వాహన మార్కెట్లో 30 శాతం వాటాపై హోండా మోటార్‌సైకిల్ కన్నేసినట్లు పరిశ్రమ వర్గాలు తెలియజేశాయి.

# తులం బంగారం రూ.లక్షా 28 వేల 200

**నిజామాబాద్ రూరల్:** బంగారం, వెండి ధరల పరుగు ఆగడం లేదు. మంగళవారం తులం బంగారం రూ. 1,25,400 ఉండగా బుధవారం రూ. 1,28,200కు చేరుకొని రికార్డు సృష్టించింది. తులం వెండి ధర రూ.1610కి చేరింది. దీపావళి పండుగ దాటేసరికి బంగారం ధర రూ. లక్షా 50 వేలకు చేరుకోవచ్చని బంగారు దుకాణాదారులు అభిప్రాయపడుతున్నారు. శుభకార్యాలు, పెళ్లిళ్ల కోసం పెద్ద మొత్తంలో కొనుగోలు చేయాల్సిన ప్రజలు ధరల పెరుగుదలతో తక్కువ బంగారంతోనే సరిపుచ్చుకుంటున్నారు. దీంతో కొనుగోళ్లు మందగించాయని దుకాణాదారులు చెప్తున్నారు.





## దేశం-విదేశం
## NATIONAL-INTERNATIONAL



# భారత్-యూకే ఎఫ్‌టీఏ.. ఆర్థిక వృద్ధికి కొత్త ఆశలు

భారత్‌యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) రెండు దేశాల ఆర్థిక సంబంధాల్లో మైలురాయిగా నిలుస్తుంది. 2025 జులై 24న ఈ ఒప్పందం కుదిరింది. యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తాజాగా భారత్ పర్యటన సందర్భంగా దీని అమలును త్వరగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇది రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచడానికి ఎంతో తోడ్పడుతుందని చెప్పారు. ఈ ఒప్పందం వల్ల భారత్‌లో అద్భుతమైన అవకాశాలు వస్తాయని నిపుణులు నమ్ముతున్నారు. 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలన్న సంకల్పానికి ఇది శక్తివంతమైన చోదకశక్తిగా పనిచేస్తుంది. రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని సుమారు 34 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ముందుకుసాగుతున్నారు.

**ఎగుమతులు, దిగుమతులు**

ఎఫ్‌టీఏ ప్రధాన ఆకర్షణల్లో ఎగుమతులు ముందంజలో ఉన్నాయి. ఈ ఒప్పందం 90% టారిఫ్ లైన్లపై తగ్గింపులు అందిస్తుంది. యూకే నుంచి భారత్‌కు విమాన భాగాలు, శాస్త్రీయ సాధనాలు, చాక్లెట్, జింజర్‌బ్రెడ్, మెడికల్ డివైసెస్ వంటివి టారిఫ్‌రహితంగా ఉంటాయి. విస్కీ, జిన్‌పై 150% నుంచి 75%కి సుంకాలు తగ్గింపు ఉంటుంది. 10 సంవత్సరాల తర్వాత ఇది 40%కు చేరుతుంది.

**ప్రొఫెషనల్ మొబిలిటీ**

ప్రొఫెషనల్ మొబిలిటీలో ఈ ఒప్పందం యూకే పాయింట్స్‌బేస్డ్ ఇమ్మిగ్రేషన్ విధానాన్ని ఉల్లంఘించకుండా తాత్కాలిక ప్రయాణాలను సులభతరం చేస్తుంది. ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, అకౌంటెన్సీ, మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ వంటి రంగాల్లో ప్రొఫెషనల్స్ కాన్ఫరెన్సులు, ఇంట్రాకంపెనీ ట్రాన్స్‌ఫర్లు, కాంట్రాక్ట్ సర్వీసెస్ కోసం వీసా ప్రక్రియలు సమానంగా ఉంటాయి. అకౌంటెంట్స్, ఆడిటర్స్, ఆర్కిటెక్ట్స్, లాయర్స్, ఇంజినీర్లకు మ్యూచువల్ రికగ్నిషన్ ఆఫ్ క్వాలిఫికేషన్స్ ప్రోత్సహిస్తుంది. ఇది అడ్మినిస్ట్రేటివ్ ఖర్చులను తగ్గిస్తుంది. దాంతో భారత IT, ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రొఫెషనల్స్‌కు యూకే మార్కెట్‌లో అవకాశాలు పెరుగుతాయి.

**వ్యవసాయం, సముద్ర ఉత్పత్తులు**


వ్యవసాయ రంగంలో యూకే నుంచి భారత్‌కు ఫ్రెష్/ఫ్రోజెన్ సాల్మన్, లాంబ్ మీట్ వంటి ఉత్పత్తులపై టారిఫ్‌లుండవు. 10 సంవత్సరాల తర్వాత చాక్లెట్, బిస్కట్స్, సాఫ్ట్ డ్రింక్స్ వంటివి ఇందులో చేరుతాయి. షుగర్, రైస్, పోర్క్, చికెన్, ఎగ్స్ వంటి సున్నిత రంగాలను ఇందులో నుంచి మినహాయించారు.

**ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం**

ఎంఎస్‌ఎంఈలకు ఇన్ఫర్మేషన్ షేరింగ్, పారదర్శకత పెంచుతూ అడ్డంకులను తగ్గించడం ద్వారా చేయూతని అందిస్తారు. కాంటాక్ట్ పాయింట్లు, మార్కెట్ ఎంట్రీ బెస్ట్‌ప్రాక్టీసెస్, ఆన్‌లైన్ ట్రేడ్ ఇన్ఫో, ఫైనాన్స్ యాక్సెస్‌పై సహకారం అందుతుంది. డిజిటల్ ట్రేడ్ ద్వారా ఎలక్ట్రానిక్ కాంట్రాక్ట్స్ ఎంఎస్‌ఎంఈలకు సహాయపడుతుంది.

**విద్య, పరిశోధన**

విద్యా రంగంలో నేరుగా కమిట్‌మెంట్స్ లేకపోయినా సర్వీసెస్ సెక్టార్ ద్వారా యూకే యూనివర్సిటీలు (అక్స్‌ఫర్డ్, కేమ్‌బ్రిడ్జ్) భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయి. ఇది భారత విద్యార్థులకు (ప్రతి సంవత్సరం 1.5 లక్షల మంది యూకే వెళ్తారు) మరింత సౌలభ్యం అందిస్తుంది. ఇన్నోవేషన్ విభాగంలో యూకేభారత్ పరిశోధన, అభివృద్ధి సహకారాన్ని పెంచుతుంది. ఇన్నోవేషన్ వర్కింగ్ గ్రూప్ రెగ్యులేటరీ అప్రోచెస్, టెక్నాలజీ కమర్షలైజేషన్‌పై పనిచేస్తుంది. పారిశ్రామికీకరణలో ఆటోమోటివ్స్ (కారు టారిఫ్‌లు 10%), ఎలక్ట్రికల్ సర్క్యూట్స్, మెడికల్ డివైసెస్, ఎయిర్‌క్రాఫ్ట్ పార్ట్స్‌పై టారిఫ్‌లు ఉండవు. భారత మాన్యుఫాక్చరింగ్ జీడీపీలో 21% (2031 నాటికి) పెరగడానికి యూకే ఇన్వెస్ట్‌మెంట్స్ (లైఫ్ సైన్సెస్, క్లీన్ ఎనర్జీ) సహాయపడతాయి. ఎన్విరాన్‌మెంట్ పరంగా గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొక్యూర్‌మెంట్‌ను ప్రోత్సహిస్తుంది.




# భారత్‌పై ప్రశంస..
## అమెరికా అధ్యక్షుడికి కౌంటర్ పడ్డట్లే!

**న్యూఢిల్లీ:** బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ భారత ఆర్థిక వ్యవస్థపై ప్రశంసలు గుప్పించారు. 2028 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారాయన. దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన కౌంటర్ ఇచ్చారా? అనే చర్చ మొదలైంది. యూకే ప్రధాని హోదాలో కీర్ స్టార్మర్ తొలిసారిగా భారత్ పర్యటనకు వచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన.. భారత ఆర్థిక వ్యవస్థపై ప్రశంసలు కురిపించారు. Namaskar doston నమస్కారం మిత్రులారా.. అంటూ హిందీలో యూకే ప్రధాని స్టార్మర్ తన ప్రసంగం ప్రారంభించారు. 2028 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందని, ఇందుకుగానూ ప్రధాని నాయకత్వాన్ని అభినందిస్తున్నానని అన్నారాయన. అలాగే.. 2047 వికసిత్ భారత్ అనేది అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను మార్చడమేనని అన్నారాయన. ఇక్కడ నేను చూసిన ప్రతిదీ మీరు(మోదీని ఉద్దేశించి..) ఆ లక్ష్యాన్ని సాధించగలరన్న నమ్మకాన్ని నాకు కలిగించింది. ఆ ప్రయాణంలో మేము



భాగస్వాములుగా ఉండాలనుకుంటున్నాం అని స్టార్మర్ (UK PM) ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. రష్యా ఆయిల్ వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో భారత ఎకానమీని డెడ్ అంటూ ట్రంప్ అభివర్ణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. ఇప్పుడు బ్రిటన్ ప్రధాని వ్యాఖ్యలు అందుకు కౌంటర్‌గా ఉన్నాయనే చర్చ నడుస్తోంది. ఇదిలా ఉంటే.. ఇవాళ న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో యూకేభారత్ మధ్య ఆర్థిక సహకారం, టెక్నాలజీ, వాణిజ్యం, విద్య రంగాల్లో సహకారం ప్రధానంగా UK-India Free Trade Agreement (FTA)పై చర్చ జరిగింది.

# పీకే తొలి జాబితాలో 51 మంది అభ్యర్థులు

**పట్నా:** బీహార్‌లో నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో సందిడి నెలకొంది. పార్టీలలో చేరికలు కొనసాగుతున్నాయి. పోటీలో దిగేందుకు పలువురు నేతలు ఉబలాటపడుతున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ నేత ప్రశాంత్ కిషోర్(పీకే)కు చెందిన జన్ సురాజ్ పార్టీ 51 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేసింది. వీరిలో 16 శాతం ముస్లిం అభ్యర్థులు ఉన్నారు. 'పీకే' ప్రకటించిన తొలి జాబితాలో మాజీ అధికారులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, వైద్యులు మొదలైనవారు ఉన్నారు. వచ్చే నెలలో బీహార్‌లో జరగబోయే రెండు దశల ఎన్నికల్లో పోటీచేయబోయే జన్ సురాజ్ అభ్యర్థుల మొదటి జాబితా ఇది. ఈ జాబితాలో 16 శాతం ముస్లిం అభ్యర్థులతో పాటు 17 శాతం మంది వెనుకబడిన వర్గాలకు చెందినవారున్నారు. ఎన్నికల వ్యూహకర్త నుండి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ రాజకీయాల్లో పేరుకుపోయిన అవినీతిని ఎత్తిచూపారు. ఈ నేపథ్యంలోనే పార్టీ నుంచి పోటీచేసే అభ్యర్థులను ఎంపిక చేసేటప్పుడు వారి క్లీన్ ఇమేజ్ కీలక అంశంగా గుర్తించారు. ఇదిలావుండగా బీహార్ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోదని ప్రశాంత్ కిశోర్ ఇటీవల స్పష్టం చేశారు. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్)తో జతకడతారంటూ వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. తమ కూటమి ప్రజలతోనే ఉంటుందని అన్నారు. బీహార్‌ను దోచుకోవడానికే పోరాటం జరుగుతోందని, ఇది సీట్ల కోసం జరుగుతున్న యుద్ధం కాదని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకాలపై తీవ్ర చర్చలు జరుగుతున్న తరుణంలో ప్రశాంత్ కిశోర్, చిరాగ్ పాశ్వాన్ మధ్య పొత్తు కుదరవచ్చనే ప్రచారం జరిగింది. కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీకి 40 సీట్లు కేటాయించాలని కోరుతున్నారని సమాచారం. గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఐదు స్థానాల్లోనూ తాము గెలిచామని, ఈసారి కూడా తమకు అదే స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వాలని పాశ్వాన్ డిమాండ్ చేస్తున్నారు.



# పెళ్లి పీటలు ఎక్కబోతున్న త్రిష..



టాలీవుడ్, కోలీవుడ్ లో లెజెండరీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న అందాల త్రిష పెళ్లి గురించి మళ్లీ చర్చలు ఊపందుకున్నాయి. తాజాగా కోలీవుడ్ సర్కిల్స్‌లో త్రిష పెళ్లికి సంబంధించిన వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. తల్లిదండ్రులు చూసిన సంబంధానికి ఆమె ఓకే చెప్పిందనే టాక్ నడుస్తుంది. త్రిష గతంలో బిజినెస్ మ్యాన్ వరుణ్ మనియన్‌తో నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ నిశ్చితార్థం పెళ్లివరకు దారి తీస్తుందని అనుకోగా, అనూహ్యంగా అది రద్దయింది. అప్పటి నుంచి త్రిష తన కెరీర్‌పైనే దృష్టి సారించింది. మనసుకు నచ్చినవాడు దొరికితే తప్పక పెళ్లి చేసుకుంటాను అని త్రిష గత కొన్నాళ్లుగా చెబుతూ వస్తుంది. తాజా సమాచారం ప్రకారం, త్రిష తల్లిదండ్రులు చండీఘర్‌కు చెందిన ఓ కుటుంబంతో సంబంధం కుదిర్చినట్లు తెలుస్తోంది. ఆ యువకుడు ఆస్ట్రేలియాలో స్థిరపడి బిజినెస్ చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల తన వ్యాపారాన్ని భారత్‌లో విస్తరించాడని కూడా చెబుతున్నారు. రెండు కుటుంబాలు దగ్గరైన నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకుని త్రిష కూడా ఈ సంబంధానికి ఓకే చెప్పినట్లు కోలీవుడ్‌లో చర్చ నడుస్తుంది. అయితే ఈ విషయంపై త్రిష నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం త్రిష చిరంజీవి హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర' లో నటిస్తోంది. అదే సమయంలో తమిళంలో 'కరుప్పు' అనే చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. ఇవే ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ప్రధాన ప్రాజెక్టులు. మునుపటి క్రేజ్ తగ్గిన నేపథ్యంలో ఈ రెండు సినిమాలపై చాలా ఆశలు పెట్టుకుంది త్రిష. ఇక బాలీవుడ్‌లో కూడా త్రిష రీఎంట్రీకు ప్లాన్ చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఒక్క సినిమాతో బాలీవుడ్ ప్రయాణాన్ని ఆపేసిన త్రిష, ఇప్పుడు మళ్లీ తన అదృష్టాన్ని పరీక్షించాలనుకుంటుందట. మరి తాజాగా త్రిష పెళ్లికి సంబంధించి జరుగుతున్న ప్రచారంలో నిజం ఎంత ఉంది అన్నది తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. కానీ ఈ సారి మాత్రం త్రిష నిజంగానే పెళ్లి పందిరిలోకి అడుగుపెడుతుంది అన్న ఆశాభావం అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.




## చాలా రోజుల తర్వాత తెలుగు తెరపై
# మెరవనున్న కీర్తి సురేష్..

కొన్నిసార్లు విజయం కూడా ఓ సవాలుగా మారుతుంది. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ జీవితంలో ఇదే నిజమైంది. మహానటి చిత్రంతో నేషనల్ లెవెల్ గుర్తింపు అందుకున్న కీర్తికి ఆ తరువాత మాత్రం సరైన హిట్‌లు దక్కలేదు. ఆ పాత్రతో అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నా, దాని ప్రభావమే ఆమె తరువాతి ప్రాజెక్టుల్లో తలెత్తింది. మహానటి తరవాత ఆమె ఏ పాత్రలో కనిపించినా, ప్రేక్షకులు ఫుల్ కన్విన్స్ కాలేకపోయారు. తెలుగులో నేను శైలజ సినిమాతో బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన కీర్తి, పవన్ కల్యాణ్ తో అజ్ఞాతవాసి, మహేష్ బాబు తో సర్కారు వారి పాట, నానితో దసరా వంటి చిత్రాల్లో నటించారు. ఈ సినిమాల్లో దసరా మాత్రమే బ్లాక్‌బస్టర్‌గా నిలవగా, చిరంజీవితో చేసిన భోళా శంకర్ చిత్రం ఫ్లాప్ అయింది. ఈ మధ్య కీర్తి తెలుగులో కొంత గ్యాప్ తీసుకుంది. బాలీవుడ్, కోలీవుడ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన ఆమె... తెలుగులో మాత్రం ఒక్క సినిమా అవకాశమూ దక్కించుకోలేకపోయింది. అయితే ఇప్పుడు ఆమె ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ ఏంటంటే.. కీర్తి సురేష్ ఎట్టకేలకు మళ్లీ ఒక తెలుగు మాస్ ఎంటర్టైనర్ ద్వారా ప్రేక్షకులని పలకరించబోతుంది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు రవి కిరణ్ కోలా దర్శకత్వంలో రౌడీ జనార్ధన అనే మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ చేస్తుండగా, ఇందులో హీరోయిన్‌గా కీర్తి సురేష్ ఎంపికయ్యిందని ఫిల్మ్ నగర్ టాక్. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్నారు. రెగ్యులర్ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. హీరోయిన్ ఎంపిక విషయంలో మొదట రష్మిక మందన్న పేరు పరిశీలించినప్పటికీ, ఎందుకో ఆ కాంబినేషన్ ఫైనల్ కాలేదు. ఆ తర్వాత అనేక పేర్లు పరిశీలించిన తరువాత చివరికి అవకాశం కీర్తి సురేష్ కు దక్కింది. త్వరలోనే మేకర్స్ అధికారిక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. తెలుగు ప్రేక్షకుల్లో కీర్తికి ఉన్న ఫాలోయింగ్ తక్కువేమీ కాదు. ఆమె మళ్లీ స్క్రీన్ పై కనిపించనుండటంతో అభిమానులు ఫుల్ ఖుషీగా ఉన్నారు. మాస్ మసాలా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విజయ్ దేవరకొండతో ఆమె కెమిస్ట్రీ ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఈ సినిమా హిట్ అయితే, కీర్తి తెలుగు ఇండస్ట్రీలో మళ్లీ తన హవా చూపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



# 20 నెలల తర్వాత మళ్లీ..
## వెంకీమామ చిత్రంపై నాగవంశీ అప్‌డేట్!

ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం మూవీతో సూపర్ హిట్ కొట్టిన వెంకీ మామ.. ఆ తర్వాత కొత్త ప్రాజెక్ట్‌ను ఇటీవలే ప్రకటించారు. అనిల్ రావిపూడితో కలిసి బ్లాక్‌బస్టర్ విక్టరీ కొట్టిన వెంకటేశ్ నెక్ట్స్ సినిమాను మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో చేయనున్నట్లు తెలిసింది. ఈ మూవీని కుటుంబ కథాచిత్రంగానే తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా వెంకటేశ్ కెరీర్‌లో 77వ చిత్రంగా నిలవనుంది. వెంకటేశ్ నెక్ట్స్ మూవీకి సంబంధించి తాజాగా నిర్మాత సూర్యదేవర నాగవంశీ అప్‌డేట్ ఇచ్చారు. దాదాపు 20 నెలల తర్వాత మాటల మాంత్రికుడు మళ్లీ మెగా ఫోన్ పట్టనున్నారంటూ ట్వీట్ చేశారు. ఈ సినిమాకు రాధాకృష్ణ(చినబాబు) నిర్మాతగా వ్యవహరిస్తున్నట్లు పోస్ట్ చేశారు. వీరిద్దరి కలిసి మరోసారి మ్యాజిక్‌ను సృష్టించడానికి సెట్స్‌పైకి వెళ్లనున్నారని రాసుకొచ్చారు. వెంకీతో త్రివిక్రమ్ ఉన్న ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు.



# డ్యూడ్ ట్రైలర్..
## మరో రొమాంటిక్ ఎంటర్‌టైనర్

లవ్ టుడే, డ్రాగన్ లాంటి డబ్బింగ్ సినిమాలతో తెలుగులోనూ హిట్స్ కొట్టిన తమిళ హీరో ప్రదీప్ రంగనాథన్.. ఇప్పుడు మరో మూవీతో వచ్చేస్తున్నాడు. అదే 'డ్యూడ్'. తెలుగు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు హీరోయిన్ కాగా కీర్తిశ్వరన్ దర్శకుడు. దీపావళి కానుకగా ఈనెల 17న మూవీ థియేటర్లలోకి రానుంది. తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ప్రదీప్ స్వతహాగా దర్శకుడు. కానీ హీరోగా లవ్ టుడే, డ్రాగన్ లాంటి రొమాంటిక్ ఎంటర్‌టైనర్స్ చేశాడు. 'డ్యూడ్' కూడా అదే జానర్ అని ట్రైలర్ చూస్తుంటే అర్థమైంది. అయితే ఈసారి కామెడీతో పాటు ఎమోషన్స్ కూడా చూపించబోతున్నారనే విషయాన్ని ట్రైలర్‌తో చెప్పకనే చెప్పారు. ప్రదీప్‌మమిత ప్రేమించుకుంటారు. కానీ పెళ్లి అనేసరికి మమిత నో చెప్పేస్తుంది. తర్వాత ప్రదీప్.. నేహాశెట్టితో ప్రేమలో పడతాడు. తర్వాత ఏమైందనేదే స్టోరీలా అనిపిస్తుంది. ట్రైలర్‌లో కథని చెప్పి చెప్పనట్లు చూపించారు. సాయి అభ్యంకర్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ బాగుంది. 'డ్యూడ్'తో పాటు దీపావళికి తెలుగులో మిత్రమండలి, తెలుసు కదా, కె ర్యాంప్ మూవీస్ వస్తున్నాయి. వీటితో పోటీలో మరి 'డ్యూడ్' ఏం చేస్తాడో చూడాలి?

## అర్జున్ దాస్, శివాత్మికల సినిమా
# ఆరు ఓటీటీల్లో స్ట్రీమింగ్



తమిళ నటుడు అర్జున్ దాస్, రాజశేఖర్ కూతురు శివాత్మిక నటించిన 'బాంబ్' సినిమా ఓటీటీలోకి రానుంది. ఈమేరకు అధికారికంగా ప్రకటన కూడా వచ్చేసింది. విశాల్ వెంకట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం కోలీవుడ్‌లో సెప్టెంబర్ 12న విడుదలై మంచి విజయం సాధించింది. కాళి వెంకట్, నాజర్, అభిరామి, సింగంపులి, బాలశరవణన్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. పాజిటివ్ టాక్స్‌తో రన్ అయిన ఈ మూవీకి 8.2 ఐఎండీబీ రేటింగ్‌తో గుర్తింపు పొందింది. 'బాంబ్' సినిమా ఏకంగా ఆరు ఓటీటీలలోకి రాబోతుంది. అమెజాన్ ప్రైమ్, ఆహా తమిళ్, సింప్లీ సౌత్, షార్ట్‌ఫ్లిక్స్, బ్లాక్‌షీప్, బ్రియో వంటి సంస్థలలో అక్టోబర్ 10న విడుదల కానుంది. అర్జున్ దాస్, శివాత్మిక రాజశేఖర్ హీరోహీరోయిన్లుగా నటించిన ఈ థ్రిల్లర్ మూవీ సరికొత్త కథతో మెప్పించింది. బాంబ్ సినిమా ఓ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో ఉంటుంది. ఒకే గ్రామం కాలపట్టి, కమ్మైపట్టి అనే రెండు చిన్న గ్రామాలుగా విడిపోయి గొడవలు పడుతుంటారు. ఆ గ్రామంలో దేవుణ్ని నమ్మని కతిరావన్ (కాళీ వెంకట్) అనుకోకుండా చనిపోతాడు. అయితే, అతణ్ని రెండు గ్రామాల మధ్యలో ఉన్న ఒక చెట్టు దగ్గర కూర్చోబెడుతారు. కానీ మణిముత్తు (అర్జున్ దాస్) మాత్రం తన ఫ్రెండ్ కతిరావన్ చనిపోలేదని నమ్ముతాడు. కానీ, మిగిలిన వారందరూ అతడు చనిపోయాడనుకుని ఏడుస్తుంటే.. అతడు సడన్‌గా అపాన వాయువు(Fart) వదులుతుంటాడు. దీంతో అతడు చనిపోయాడా లేదా అనే ఆందోళనలో గ్రామస్థులు ఉంటారు. ఇంతకూ అతను చనిపోయాడా లేదా.. ఒకవేళ చనిపోతే అలా ఎందుకు చేస్తున్నాడు అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.



# పుణేకి పెద్ది

ప్రేయసితో కలిసి పుణేలో ల్యాండ్ అయ్యాడు పెద్ది. అక్కడి అందమైన పరిసరాల్లో ఇద్దరూ ఆటా పాటా మొదలుపెట్టారు. రామ్‌చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్‌గా రూపొందుతున్న 'పెద్ది' చిత్రానికి సంబంధించినదే ఈ ఆటా పాటా. ఈ స్పోర్ట్స్ డ్రామా మూవీకి బుచ్చి బాబు సనా దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ పుణేలో ఆరంభమైంది. ఈ షెడ్యూల్‌లో రామ్‌చరణ్, జాన్వీ కపూర్ పై ఓ పాట చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. చిత్రసంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ స్వరపరచిన ఈ పాటకు జానీ మాస్టర్ కొరియోగ్రాఫర్. ఈ పాట విజువల్ ట్రీట్‌గా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. ఒకవైపు షూటింగ్ జరుపుతూనే మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: ఆర్ రత్నవేలు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com